
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 13.11.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 24 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

చేజారిన బీహార్

# బీజేపీకి బేజార్



- నరేంద్ర మోడీకి ఢిల్లీని మించిన షాక్
- పార్టీకి చేటు తెస్తున్న వ్యక్తిగత విమర్శలు
- కమలంలో అసంతృప్తి కల్లోలం
- మసకబారడం మొదలైన మోడీ ఇమేజ్
- నితీష్‌ది అభివృద్ధి విజయం

భారత క్రికెట్ టీమ్ వన్డే మ్యాచ్ ఆడుతుంది. సచిన్ ఒక్కడే సెంచరీ కొట్టి మిగతా వాళ్లంతా రెండంకెల స్కోరు దాటలేదనుకోండి... ఆట ఓడిపోతుంది. సచిన్ ఒక్కడే మ్యాచ్‌ను గెలిపిస్తాడని మిగతా ఆటగాళ్లు అనుకున్నా, నేనొక్కడినే మ్యాచ్‌ను గెలిపించగలనని సచిన్ అనుకున్నా మ్యాచ్‌ను గెలవడం కంటే ఓడిపోయే అవకాశాలెక్కువుంటాయి. ఒక్కడే మ్యాచ్‌ను గెలిపించే సంఘటనలు అరుదుగా జరుగుతుంటాయి. ఇలాంటి సందర్భంలో మ్యాచ్‌ను గెలిపించిన వాడు ఇది సమిష్టి విజయమని, ఇందులో ఆటగాళ్లందరి కృషి వుందని చెబితే మిగతా వాళ్లకు ఉత్సాహమొస్తుంది. తర్వాత మ్యాచ్‌లో బాగా ఆడాలనే పట్టుదల పెరుగుతుంది. ఆటల్లోనైనా, ఓట్ల వేటల్లోనైనా సమిష్టి సూత్రమే గెలుపు మంత్రం. వ్యక్తిగత విజయాలను సైతం సమిష్టి విజయాలుగా మలిచినప్పుడే భవిష్యత్ విజయాలకు బాటలు పడతాయి.

ప్రస్తుతం భారత క్రికెట్ జట్టుకు భారతీయ జనతాపార్టీకి దగ్గరి పోలికలున్నాయి. ఇంతకుముందు భారత జట్టు గెలుపు కోసం ఫామ్‌లో వున్న బ్యాట్స్‌మెన్ మీద ఆధారపడేది. ఫామ్‌లో వున్న బ్యాట్స్‌మెన్ అవుటయ్యాడంటే మ్యాచ్ ఓడిపోయినట్లే! ఇప్పుడు బీజేపీ పరిస్థితి కూడా అలాగే తయారైంది. గెలిస్తే నరేంద్ర మోడీ ఇమేజ్‌తో గెలవాలి. ఆయన ఇమేజ్ లేకుంటే ఓడిపోవాలి. మొన్నటి దాకా కాంగ్రెస్‌లో ఈ సంప్రదాయం వుండేది. గెలిస్తే సోనియా మహిమ, ఓడిపోతే ఆ రాష్ట్ర పార్టీ సంస్థాగత వైఫల్యం అనే ముద్ర వేసేవాళ్లు. బీజేపీలోనూ ఆ సంస్కృతి తేవాలని చూసారు. బీహార్‌లో బీజేపీ గెలిచుంటే దానిపై నరేంద్ర మోడీ ఆకర్షణ ముద్రవేసేవాళ్ళు. ఓడిపోయింది కాబట్టి సమిష్టి బాధ్యత అనే ఒక బాధ్యతారాహిత్య ప్రకటన ఇచ్చి తప్పించుకోవాలని చూసారు. కాని దీనిపై అద్వానీ,

(మిగతా 11వ పేజీలో)

- పవన్ కోసం

# బాబు పడి "కాపు"లు

- ఈ కలయికలో మర్మమేమిటి?

3లో



- వర్షం కురిసింది... రైతాంగం మురిసింది




# వానా... వానా... వందనం!

ఈ జిల్లాకు ఇక వానలే లేవా... నీళ్ల కోసం అగచాట్లు తప్పవా... సాగునీటికి వెతలేనా... ఈ సంవత్సరం కూడా పైర్లు పెట్టే పని లేదా... ఈ చంద్రబాబు వస్తేనే ఇంతే... వర్షాలు రావు... ఇదీ నిన్నటి దాకా జిల్లాలో పరిస్థితి. ఈ నాలుగు రోజులు గాని జిల్లాలో భారీ వర్షాలు పడకపోయివుంటే ఆ పాపాన్నంతా చంద్రబాబుకు అంటగట్టే వాళ్లు జనం. ఎలాగో వరుణుడు కరుణించడంతో చంద్రబాబు ఆ అప్రదిష్ట నుండి బయటపడ్డాడు.

చిత్తకార్తెలోనూ ఈసారి చినుకు పడలేదు. ఎండలు చూస్తేనా... మే నెలకు, నవంబర్ నెలకు పెద్ద తేడా లేకుండా కాయసాగాయి. చిత్తకార్తెలో వానలు లేవు. ఇక మిగిలిన ఆశలు స్వాతి, విశాఖ కార్తెలే! ఈ రెండు కార్తెలలోనూ ఇక వర్షాలు పడకుంటే అంతే సంగతులు, కరువు తప్పదు.

ఈ సమయంలో మేఘం కురుణించి వర్షించింది. ఈశాన్య ఋతు పవనాల ప్రభావమైతేనేమీ, బంగాళాఖాతంలో 'రోవాన్' తుఫాన్

(మిగతా 11వ పేజీలో)



# జిల్లా అంతటా జలకళ



నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రాంతాల్లో స్వర్ణముఖి, కాళంగి నదులు జలకళతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో నాయుడుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో వర్షాలకు సాగునీటి చెరువులు, నదులు, కాలువల్లో నీరు చేరికతో జలకళ వచ్చింది. ఆదివారం ఉదయం నుంచి మంగళవారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో, ఎగువ చిత్తూరు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాళంగి నది నుంచి నెర్రికాలువ ద్వారా సాగునీరు విడుదల కావడంతో సూళ్లూరుపేట, తడ మండలాల్లోని 18చెరువులకు నీరు చేరుతోంది. శ్రీకాళహస్తి సమీపంలో వున్న స్వర్ణముఖి ఆనకట్ట నుంచి పెళ్ళకూరు మండలం చెంబేడు, పెళ్ళకూరు ప్రధాన పంట కాలువలకు నీరు విడుదల చేయడంతో ఈ మండలంలో చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి.

చిత్తూరు జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు కురవడంతో స్వర్ణముఖి నదికి పై భాగంలో వున్న ఆనకట్టల గేట్లు తెరవడంతో స్వర్ణముఖి నది మంగళవారం ఉదయం నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండేళ్ళ తర్వాత నదికి జలకళ రావడంతో పరివాహక ప్రాంతాల్లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయుడుపేట, పెళ్ళకూరు, ఓజిలి మండలాల్లో పలు చెరువులకు నీరు చేరుతోంది. భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశాలు ఏర్పడ్డాయి. నాయుడుపేట డివిజన్‌లో భారీ వర్షాలకు పలు మండలాల్లో విద్యుత్ స్థంభాలు, భారీ వృక్షాలు పడిపోయాయి. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో రెండు భారీ వృక్షాలు గాలికి పడిపోయాయి. విన్నమాల సమీపంలో వున్న ఆర్టీవో కార్యాలయం ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నాయుడుపేట రెవెన్యూ డివిజన్ ఆరు మండలాల్లో సోమవారం ఉదయం 8గంటల నుంచి మంగళవారం ఉదయం 8గంటల వరకు 529.6 మి.మి. వర్షపాతం నమోదైంది.

# జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

నెల్లూరుజిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరుజిల్లా సంగంలోని తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వర్షం కోసం జరుపుతున్న శ్రీ లలితా రుద్ర మహాయజ్ఞంలో 7వతేదీ బొమ్మిరెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన బొమ్మిరెడ్డికి పీఠాధిపతి రాజరాజేశ్వరానంద స్వామి సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొమ్మిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని 46మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. జిల్లాలో సగటు వర్షపాతం కన్నా అతి తక్కువగా వర్షం పడడంతో సాగునీటి కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారన్నారు. గత ఏడాది వర్షాలు తక్కువగా పడినా సోమశిలలో 48టిఎంసీలకు పైగా సాగునీరు ఉండడంతో సాగు గట్టెక్కిందన్నారు. ప్రస్తుతం సోమశిలలో 14టిఎంసీల నీరు నిల్వ ఉండడంతో పెన్నా డెల్టా క్రింద సాగు నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా పరిషత్ మొదటి ప్రాధాన్యం సాగునీటికి ఇచ్చి నిధులు ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అల్లారెడ్డి సతీష్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు దేవసహాయం, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, దగుమాటి మధుసూదన్‌రెడ్డి, కంటా బత్తిన రఘునాథరెడ్డి, ఎంపిటిసి సభ్యులు, రంగయ్య, కాకు మధు, బొమ్మిరెడ్డి దినేష్‌రెడ్డి, ఫణీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాపుల రిజర్వేషన్‌కు సహకరించాలి

కాపులను బీసీల్లో చేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సముఖంగా ఉన్నారని, దీనికి ఆర్.కృష్ణయ్య, మంద కృష్ణమాదిగ సహకరించాలని అఖిలభారత కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. సోమవారం నెల్లూరులో నిర్వహించిన సమాఖ్య ఆత్మీయ సమావేశంలో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ గతంలో కొంతమంది కుట్రలవల్ల బీసీలుగా వున్న కాపులను ఓసీలుగా మార్చారన్నారు. రాష్ట్రంలో అధికశాతం కాపులు ఉన్నారని, తమ జాతిని ముందుకు రానివ్వకుండా దురుద్దేశంతో ఓసీలుగా మార్చారన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా నూతన కమిటిని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మల్లు రామయ్య, ప్రధానకార్యదర్శిగా దొరబాబు, ఉపాధ్యక్షులుగా పోస్టల్ బాబు, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, నగర అధ్యక్షుడిగా శింగంశెట్టి రవిచంద్ర పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శివకుమార్, నారాయణ, సుబ్బారావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.




# వీరాజీకి పురస్కారం

కృష్ణాజిల్లా రచయితల సంఘం ముక్కామల నాగభూషణం ఉత్తమ జర్నలిస్టు అవార్డును వీరాజీకి ప్రకటించిందని గొల్లపూడి శ్రీనివాస్(యుఎస్ఏ) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపి అసెంబ్లీ డిప్యూటీస్పీకర్ మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌లు ప్రదానం చేసినట్లు తెలిపారు. వీరాజీకి సాహిత్యం, జర్నలిజంలో అపార అనుభవముందన్నారు. ఆయన ఏది వ్రాసినా సామాజిక స్పృహతో వ్రాస్తారని, తెలుగు కథ శతజయంతి ఉత్సవాలలో వీరాజీ కథలకు నీరాజనం పట్టారని తెలిపారు. అనేక అవార్డులు అందుకున్న ఆయనకు తెలుగు విశ్వవిద్యాలయం ఆయన వ్రాసిన కథకి కీర్తి పురస్కారం, జర్నలిజంలో చేసిన సేవలకు 2013లో ప్రతిభా పురస్కారం అందుకున్నారన్నారు. యువతరం కోసం ఆంధ్రప్రత్రిక ద్వారా ఆయన ఇచ్చిన ప్రోత్సాహకానికిగాను అమెరికన్ సంస్థ(ఏబిఐ 1990-2000) దశాబ్దపు అవార్డును అందించిందన్నారు. అఖిలభారత ఐఐఎఫ్ఎస్ "భారతజ్యోతి" జాతీయ అవార్డు ఇచ్చి సత్కరించిందని తెలిపారు. వీరాజీ ప్రపంచ భాషలలో మొదటిసారిగా ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థి జీవిత "తొలి మలుపు" నవలలో సాహితీ పరిమళాలు అందించారన్నారు. ఐదున్నర దశాబ్దాల కీర్తిశోభ వీరాజీని వరిస్తున్నా ఇప్పటికీ శ్రద్ధగా ఒదిగి వుండి తన వ్యాసాంగాన్ని అవిశ్రాంతంగా కొనసాగిస్తున్న నిగర్వి రచయిత వీరాజీ అని కొనియాడారు.

# వాహనాలపై 470 కేసులు

- రూ.57లక్షలు వసూలు

నెల్లూరుజిల్లాలో గత నెలలో 470 కేసులను నమోదు చేసి వాటి ద్వారా రూ.57.04 లక్షలు వసూలు చేసినట్లు రవాణాశాఖ ఉపరవాణా కమిషనర్ శివరామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా సరిహద్దు తనిఖీ కేంద్రం బివిపాలెం వద్ద 88వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.10.69 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. కృష్ణపట్నం పోర్టు ద్వారా వాహనాల్లో అధిక లోడు రవాణా చేయరాదని లేఖ వ్రాసినట్లు తెలిపారు.

# అదుపు తప్పిన వోల్వోబస్సు

ప్రైవేటు వోల్వో బస్సు డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని గుంతలోకి దిగిపోయింది. సోమవారం తెల్లవారుజామున నెల్లూరు పెన్నానది వంతెన సమీపంలో జాతీయ రహదారిపై ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు చెన్నై నుంచి విజయవాడకు వెళుతున్న ప్రైవేటు ఓల్వో బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎడమవైపు 20అడుగుల గుంతలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 8మందికి గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ బస్సు బోల్తా పడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. నెల్లూరు రూరల్ ఎస్సై దశరథరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పేద బ్రాహ్మణ విద్యార్థులకు సహాయం

నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు సంఘం నిర్వాహకులు డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఆపైన చదువుకునే విద్యార్థులకు, ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు నెల్లూరు ట్రంకు రోడ్డులోని టివియస్ కల్యాణసదన్‌లో లేదా త్యాగరాజస్వామి ఆరాధన కమిటి నిర్వాహకులు నాగదేవీప్రసాద్‌ను కలిసి పొంద వచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెలాఖరులోగా అందజేయాలన్నారు.

# ఎస్టీ కాలనీని అభివృద్ధి చేస్తా!

**- మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు**

నెల్లూరుజిల్లా బోగోలు మండలం కోవూరుపల్లి ఎస్టీ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు తెలిపారు. ఎస్టీ కాలనీని దత్తత తీసుకున్న సందర్భంగా మస్తాన్‌రావు కాలనీలో పర్యటించి అధికారులతో సమావేశమయ్యారు. స్థానికులకు అవసరమైన వసతులు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు కాలనీ వాసులకు అవసరమైన పక్కా గృహాలు, సిమెంటురోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీటి వనరులు ఏర్పాటు చేయడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ప్రయత్నించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ జయప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ కొండయ్య, ఎంపిడిఓ వెంకటశేషయ్య, సర్పంచ్ పద్మమ్మ, టిడిపి మండల కన్వీనర్ పిన్నిబోయిన సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

# దుకాణాల రిజిస్ట్రేషన్లు రెన్యూవల్ చేసుకోండి

వ్యాపార, వాణిజ్య సంస్థలు ఈ నెల 30లోగా తమ దుకాణాలు, వ్యాపార సంస్థలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు రెన్యూవల్ చేసుకోవాలని ఉపకార్మిక కమిషనర్ ఎస్.వై.శ్రీనివాస్ తెలిపారు. నెల్లూరులోని కార్మికశాఖ కార్యాలయంలో సోమవారం సహాయ కార్మికశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20వేల దుకాణాలు, వ్యాపార సంస్థలు, హోటళ్ళు, సినిమాహాళ్ళు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 5వేల మంది యజమానులు మాత్రమే రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్ చేసుకున్నారని తెలిపారు. మిగిలినవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేసుకోవాలన్నారు. సమాచారం కొరకు 0861-2323114 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ పి.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులను 'టీకా'తో అడ్డుకోండి



ప్రతి చిన్నబిడ్డకు 9 ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడటానికి టీకాలను విధిగా వేయించాలని అదనపు సంయుక్త కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ అన్నారు. ఆయన 7వ తేదీ నెల్లూరు, వెంగళరావునగర్‌లో అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఇంద్రధనుస్సు టీకా కార్యక్రమం 2వ ఫేస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.ఎస్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇంకా 38శాతం పిల్లలకు టీకాలు వేయించకపోవడం చాలా విచారకరమన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆయన కోరారు. అదేవిధంగా గర్భిణీస్త్రీలకు వ్యాధులు రాకుండా నిరోధించడానికి ఇచ్చే టీకాలను కూడా తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. జిల్లా వైద్యశాఖాధికారిణి డా॥ ఎ.డి.వి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ అనేక వ్యాధులను పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు సోకకుండా ఉండటానికి టీకాలు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో అదనపు వైద్యశాఖాధికారి డాక్టర్ నారాయణ నాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జయసింహ, డిప్యూటీ డెమో వి.సుభావతి, పిడిపిఓ సత్యకుమారి, కార్పొరేటర్ ఖాదరున్నీసా పాల్గొన్నారు.

# పవన్ కోసం బాబు పడి 'కాపు'లు

"ఎక్కడ నెగ్గాలో కాదు... ఎక్కడ తగ్గాలో తెలిసినోడే గొప్పోడు". పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటించిన 'అత్తారింటికి దారేది' సినిమా క్లైమాక్స్‌లో యం.యస్. నారాయణ చెప్పే డైలాగ్ ఇది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ డైలాగ్‌ను బాగా వంటబట్టించుకున్నట్లున్నాడు. పవన్ కల్యాణ్ విషయంలో ఈ డైలాగ్ పాలసీని బాగానే వాడుకుంటున్నాడు.



రాజకీయాల్లో ఎత్తుపల్లాలను ఎలా ఎక్కాలో, ప్రత్యర్థులను ఏ రీతిలో తొక్కాలో బాగా తెలిసిన వాడు చంద్రబాబు. అవసరమనుకుంటే చేతులు పట్టుకోవడానికైనా, అవసరం తీరాక జుట్టు పట్టుకోవడానికైనా ఆయన చేతులెప్పుడూ సిద్ధంగానే వుంటాయి. చెరుకు మిషన్‌లో చెరుకు గడను పెడితే రసం కారి పిప్పి అయినా మిగులుతుందేమోగాని, చంద్రబాబు వాడడం మొదలుపెడితే ఆ పిప్పి కూడా మిగలదు. ఎవరినైనా అంతగా వాడేస్తాడాయన. 2014ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌ను కూడా అంత బాగా వాడుకున్నాడు. ఎన్నికలయ్యాక యథాఫలంగా పిప్పిని పక్కనేసినట్లే ఆయనను కూడా పక్కనపెట్టాడు. మళ్ళీ రాష్ట్రంలో కాపుల అలజడి రేగేసరికి అదే పవన్‌ను బ్రతిమలాడి విజయవాడకు పిలిపించుకుని మాట్లాడాడు.

ఈ నెల 12వ తేదీన విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ హైదరాబాద్‌లో వున్న పవన్ కోసం ప్రత్యేక విమానం పెట్టి విజయవాడకు తీసుకొచ్చి ఇద్దరి మధ్య భేటీ పెట్టించారు. చంద్రబాబు కోరిక ప్రకారమే ఈ భేటీ జరిగినట్లుగా తెలుస్తుంది. చంద్రబాబు కలవాలంటున్నారని, మాట్లాడాలంటున్నారని కామినేని శ్రీనివాస్ ఒకటికి నాలుగుసార్లు పవన్ ఇంటికి తిరగడంతో ఇక కాదనలేక ఆయన వచ్చినట్లు తెలుస్తోంది. చంద్రబాబుతో సమావేశం అనంతరం బయటకొచ్చిన పవన్ ముభావంగానే కనిపించారు. చంద్రబాబుతో నాలుగు విషయాలను ప్రధానంగా ప్రస్తావించినట్లు తెలిసింది. విశాఖ మన్యంలో బాక్సైట్ తవ్వకాలను నిలిపేయాలని పవన్ ఖరాఖండీగా చెప్పినట్లు తెలిసింది. అలాగే ప్రత్యేకహోదా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని, రాజధానిలో బలవంతపు భూసేకరణ ఆపేయాలని కూడా పవన్ గట్టిగా చెప్పాడని సమాచారం. చంద్రబాబు మాత్రం రాష్ట్రంలోని కాపుల సంక్షేమం కోసం కాపునాడు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రామాంజనేయులును దీనికి ఛైర్మన్‌గా పెడుతున్నట్లు పవన్‌కు తెలియజేసారని వినికిడి.

పవన్‌ను ప్రత్యేక విమానంలో విజయవాడ పిలిపించుకుని మాట్లాడడం వెనుక అనేక కారణాలు కనిపిస్తున్నాయి. 2014 ఎన్నికల్లో పవన్ ప్రచారం తెలుగుదేశంకు బాగా కలిసొచ్చింది. తెలుగుదేశంకు ఎప్పుడూ దూరంగా వుండే అత్యధిక శాతం కాపులు ఆ ఎన్నికల్లో ఆ పార్టీకి దగ్గరయ్యారు. దీనిలో జగన్ చేతకానితనం కొంతయితే, పవన్ కల్యాణ్ ప్రభావం కొంచెం ఎక్కువగా వుంది. కాపుల మద్దతు లేకుంటే మొన్న తెలుగుదేశం అధికారంలోకి వచ్చి వుండేది కాదు.

ఇటీవల కాలంలో తెలుగుదేశంలో 'కమ్మ' సామాజికవర్గ ప్రాబల్యం ఎక్కువ కావడంతో కాపుల్లో సహజంగానే అసంతృప్తి రేగింది. అక్కడక్కడా ఇది బయటపడడసాగింది. ఇక అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అమరావతి రాజధాని శంకుస్థాపనకు రావాలని పవన్ కల్యాణ్‌కు ఇద్దరు మంత్రుల చేత ఆహ్వానం పంపారు. రామోజీరావు వంటి మీడియా అధిపతికి చంద్రబాబు స్వయంగా ఆహ్వానం ఇచ్చారని, అలాంటిది ఎన్డీఏలో భాగస్వామి అయిన జనసేన నేత పవన్‌కు ఆ మాత్రం విలువ లేదా అని పవన్ అభిమానులు అప్పుడే మండిపడ్డారు. షూటింగ్ బిజీలో ఉన్నానని చెప్పి రాజధాని శంకుస్థాపనకు పవన్ రాలేదు. చంద్రబాబుకు కావాల్సింది కూడా ఇక్కడకు పవన్ రాకపోవడమే. ఆయనొస్తే సిఎం పక్కకుపోయి పవన్ హైలెట్ అవుతాడు. దేశ, విదేశీ నేతల దృష్టిలో పడతాడు. ఇది చంద్రబాబుకు ఇష్టం లేదు. అదీగాక రాజధాని శంకుస్థాపన సభలో నరేంద్ర మోడీ ప్రత్యేకప్యాకేజీ గాని, ప్రత్యేకహోదా గాని ఇస్తారని చంద్రబాబు ఆశించాడు. ఈ పాయింట్లు హైలెట్ అయ్యి తన ప్రభుత్వానికి పాపులారిటీ రావాలంటే పవన్ వుండకూడదు. దీనికి తగ్గట్లే పవన్ రాలేదు. కాని చంద్రబాబు ఆశించినట్లు నరేంద్ర మోడీ ఏమీ ఇవ్వలేదు. ఇది చంద్రబాబుకు పెద్ద అశనిపాతంగా మారింది. చంద్రబాబు పవన్‌ను తగ్గించి చూస్తున్నాడనే ప్రచారం కూడా అప్పుడే మొదలైంది. రాజధాని భూముల విషయంలో పవన్ జోక్యం చేసుకోవడం కూడా చంద్రబాబుకు మింగుడు పడలేదు. అందుకే పవన్‌ను తగ్గించే ప్రయత్నం చేసాడు.

అయితే హరిరామజోగయ్య వ్రాసిన పుస్తకంతో చంద్రబాబుకు మళ్ళీ పవన్‌కల్యాణ్ అవసరమొచ్చింది. వంగవీటి రంగా హత్యలో చంద్రబాబు ప్రమేయముందంటూ జోగయ్య ఆ పుస్తకంలో ప్రస్తావించారు. ఇది తెలిసి రాష్ట్రంలోని కాపులంతా రగిలిపోతున్నారు. ఈ కథనాలు వచ్చిన వెంటనే చంద్రబాబు కాపులను చల్లార్చడం కోసం 100కోట్లతో కాపు కార్పొరేషన్‌ను ప్రకటించారు. కాని ఇది పెద్దగా ఫలితాలనిచ్చేది కాదు. ముద్రగడ పద్మనాభం వంటి సీనియర్ కాపు నాయకులు అప్పుడే చంద్రబాబు మీద దండయాత్ర మొదలుపెట్టారు. ఇక కాపులను సమిష్టిగా నిలపగలిగే నాయకులు రాష్ట్రంలో లేరు. ఉన్నవారిలో పవన్‌కల్యాణ్ బెటర్. కాపులను తన గూటి నుండి పోకుండా చేసుకునేందుకే చంద్రబాబు పవన్ రాక కోసం పడిగాపులు కాసాడనేది పొలిటికల్ టాక్!

## మధుమేహ వ్యాధి అవగాహన సదస్సు

ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన సాయంత్రం నెల్లూరు టౌన్‌హాల్‌లో మదుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. దయాబిటీస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్ అధినేతలు డాక్టర్ ఎన్.సత్యనారాయణమూర్తి, డాక్టర్ యం.వి.రామమోహన్‌ల ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో గుండె వ్యాధి వైద్యనిపుణులు డాక్టర్ భక్తవత్సలరెడ్డి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ దేశాయ్‌మాధవ్, న్యూరాలజిస్ట్ డాక్టర్ బి.యుగంధర్‌రెడ్డి, సీనియర్ సర్జన్ డాక్టర్ వి.ప్రకాష్, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ పి.ఎల్.రావులు పాల్గొని ప్రజలకు వైద్యపరమైన సలహాలు, సూచనలు అందించనున్నారు. ఈ సందర్భంగా ఆరోజు సాయంత్రం 5గంటల నుండి ఉచిత బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించనున్నారు.

## శబరిమలైకి స్పెషల్ బస్సులు

ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా నెల్లూరు ఆర్టీసీ శబరిమలైకు స్పెషల్ బస్సులు నడుపుతోంది. ఈ నెల 16వ తేదీన సూపర్ లగ్జరీ తొలి బస్సును శబరిమలైకు పంపిస్తున్నారు. ఈ బస్సులో ఒక్కో టిక్కెట్‌ను 3300 రూపాయలుగా నిర్ణయించారు. నెల్లూరు నుండి బయలుదేరే బస్సు కాణిపాకం, శ్రీపురం, భవానీ, ఎరిమేలి మీదుగా పంబానదికి చేరుతుంది. అలాగే తిరుగు ప్రయాణంలో కుర్తాళం, మధురై, చెన్నైల మీదుగా నెల్లూరు చేరుకుంటుంది. ఒకేసారి 15టిక్కెట్లు బుక్ చేసుకుంటే ఒక టిక్కెట్ ఉచితంగా ఇస్తున్నారు. అలాగే సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులకు కూడా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. సూపర్‌లగ్జరీ బస్సుకైతే కిలోమీటర్‌కు 42 రూపాయలు, డీలక్స్ బస్సుకు 41రూపాయలు, ఎక్స్‌ప్రెస్‌కు 45రూపాయలు, పల్లెవెలుగుకు 38రూపాయలు లెక్కన అద్దె నిర్ణయించారు. బస్సులు కావాల్సిన వాళ్ళు 7382926409, 7382885096, 7382884737 నెంబర్లలో సంప్రదించవచ్చు.

## కాలధర్మం

### గునపాటి కృష్ణారెడ్డి



విడవలూరు సాగునీటి సంఘం అధ్యక్షులు గునపాటి కృష్ణారెడ్డి ఈ నెల 5వ తేదీన స్వర్గస్తులైనారు. ఆయన వయసు 74సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. కృష్ణారెడ్డిది వ్యవసాయ కుటుంబం. గ్రామంలో అందరితో సత్సంబంధాలు నెరపుతూ మంచి పేరు పొందారు. ఆయన పెద్దకొడుకు వరదారెడ్డి గ్రామంలోనే వుంటూ వ్యవసాయం చూస్తుండగా రెండో కొడుకు శ్రీధర్‌రెడ్డి హైదరాబాద్‌లో బిల్డర్‌గా రాణిస్తున్నారు. కృష్ణారెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## వరద బాధితులను ఆదుకోవాలి



ఈ నెల 12న నెల్లూరు నగరంలోని 48వ డివిజన్ జయలలిత నగర్, పొర్లుకట్ట ప్రాంతాల్లో, 5వ డివిజన్‌లోని అహ్మద్ నగర్, బర్మాషెల్‌గుంట ప్రాంతాల్లో నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పర్యటించారు. జిల్లాలో కురిసిన వర్షాల వల్ల సోమశిల బ్యారేజీ నుంచి పెన్నా నదికి నీరు వదలడంతో నీట మునిగిన అనేక ఇళ్లను అధికారులతో కలిసి పరిశీలించి వరద ప్రమాద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా డా॥ పి.అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా సోమశిల జలాశయం నుండి పెన్నా నదికి నీరు వదలడంతో నెల్లూరు నగరంలోని పొర్లుకట్ట, జయలలితనగర్, అహ్మద్‌నగర్, బర్మాషెల్‌గుంట ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో చాలా ఇళ్లు గోడలు కూడా కూలిపోవడం జరిగిందని, కొన్ని ఇళ్లల్లో అయితే ప్రజలు సామాన్లు కూడా తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇలాంటి సంఘటనలు జరిగి ఇళ్లు కూలిపోయిన వారికి 6వేల రూపాయలు, ఇళ్లలోకి నీరు చేరిన వారికి 4వేల నుంచి 6వేల రూపాయలతో పాటు 20కేజీల బియ్యం నెల్లూరు నగరంలో కొన్ని వేల మందికి ఇవ్వడం జరిగిందని ప్రస్తుతం ఇళ్లు కూలిపోయిన వారికి 10వేల రూపాయలు, ఇళ్లలోకి నీరు చేరిన వారికి 6వేల నుంచి 8వేల రూపాయలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేసి వరద ప్రమాద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, ఎం.డి.ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్, నాయకులు వందవాశి రంగ, వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో పందుల రాజ్యం

**• పంది దాడిలో గాయపడ్డ బాలిక**

నెల్లూరు నగరంలో పందులు రాజ్యమేలుతున్నాయి. మురికివాడలలోనే కాకుండా ప్రధాన ప్రాంతాల్లోనూ పందులు మందలు మందలుగా తిరుగుతున్నాయి. అయితే నగర పాలక సంస్థ మాత్రం పందులను, మనుషులను ఒకటేగా చూస్తున్నట్లుంది. ఈ పందులను పట్టి దూరంగా తరలించాలనే ఆలోచనే లేకుండా పోయింది. చివరకు ఈ పందులు మా ఏరియాల్లో మీరు ఉండడమేంటన్నట్లుగా మనుషుల మీద దాడులకు దిగుతున్నాయి.



12వ తేదీ వెంకటేశ్వరపురంలోని జనార్ధనరెడ్డి కాలనీలో హలీమా అనే మూడేళ్ళ చిన్నారిపై పంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఆ బాలిక ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుంది. కొన్ని రోజుల క్రితమే ఇదే ప్రాంతంలో ఐదేళ్ళ బాలుడు పందుల దాడిలో చనిపోయాడు. ఇంతకుముందు కూడా ఇలాంటి సంఘటనలు జరిగివున్నాయి. మరి నగర పాలకులు ఎప్పటికి మేలుకుంటారో?

# 'ప్రభా'తం

దేశమంతా ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూసిన బీహార్ అసెంబ్లీ ఫలితాలు రానేవచ్చాయి. బీహార్‌లో పోరు హోరాహోరీగా వుందన్న ఆయా మీడియా సంస్థల సర్వేలన్నీ తల్లక్రిందులయ్యాయి. ఏ ఒక్క సంస్థ సర్వేను కూడా నిజం కానీయలేదు బీహార్ ఓటర్లు. సర్వేల దరిదాపుల్లో కూడా ఫలితాలు లేవు. ముఖ్యంగా ఎన్‌డి టివి వంటి ప్రతిష్ఠగల మీడియా సంస్థలు సైతం బీహార్ ఓటర్ల నాడిని పట్టడంలో బోల్తాపడ్డాయి. ఈ సంస్థ అయితే పూర్తి రివర్స్‌లో తన ఎగ్జిట్‌పోల్స్‌ను వెల్లడించింది. మొన్న ఢిల్లీ, నేడు బీహార్ ఫలితాలను చూసాక, ఈ అనుభవంతోనన్నా ఇక సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌కు ముగింపు పలుకుతాయేమో చూడాలి.

హోరాహోరీ పోరు జరుగుతుందని అందరూ భావించిన బీహార్‌లో అంచనాలు తలక్రిందులయ్యాయి. ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నేతృత్వంలోని మహాకూటమి 178స్థానాలతో తిరుగులేని ఆధిక్యత సాధించింది. 243స్థానాలున్న అసెంబ్లీలో 178 స్థానాలను నితీష్ ఒంటి చేత్తో గెలిపించాడు. నితీష్‌ను మట్టి కరిపించి బీహార్‌లో పాగా వేయాలనుకున్న బీజేపీ అధిష్టానం కలలు కల్లలయ్యాయి. మహాకూటమి ఫలితాలలో జేడీయు కంటే ఆర్జేడీకి సీట్లు ఎక్కువ వచ్చినా, ఈ గెలుపులో ప్రధాన పాత్ర మాత్రం నితీష్ కుమార్‌దే! ఈ గెలుపు ద్వారా దేశంలో జ్యోతిబసు, నరేంద్ర మోడీ, నవీన్ పట్నాయక్, శివరాజ్‌సింగ్ చౌహాన్, షీలాదీక్షిత్, రమణ్‌సింగ్ వంటి హ్యాట్రిక్ సిఎంల సరసన నితీష్ కూడా చేరాడు.

గుజరాత్‌లో నరేంద్ర మోడీ, ఒరిస్సాలో నవీన్ పట్నాయక్, మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్, ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్‌లు కేవలం అభివృద్ధి నినాదంతోనే మూడుసార్లు అధికారంలోకి రాగలిగినప్పుడు అదే అభివృద్ధి మంత్రం బీహార్‌లో మాత్రం ఎందుకు పనిచేయదు. ఆ అభివృద్ధికి కారకుడైన నాయకుడు ఎందుకు ముఖ్యమంత్రి కాలేడు. అభివృద్ధి నినాదంగా ఎన్నికలు జరిగిన మిగిలిన రాష్ట్రాల్లో ఏదైతే జరిగిందో బీహార్‌లోనూ అదే జరిగింది. కాకపోతే ఒకటే తేడా! గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీతో కలిసి అధికారాన్ని చేజిక్కించుకున్న నితీష్‌కుమార్, ఈ ఎన్నికల్లో అదే బీజేపీతో పోరాడి అధికారాన్ని కైవసం చేసుకున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ ప్రత్యర్థిగా తలపడ్డ ఆర్జేడి అధినేత లాలూను ఈ ఎన్నికల్లో మిత్రునిగా మలచుకుని ఓట్ల పరంగా లబ్ది పొందారు.

బీహార్‌లో ఇప్పుడు గెలిచింది అభివృద్ధి నినాదమే. నితీష్ రాకముందు ఆ రాష్ట్రం ఆటవిక పాలనకు నమూనాగా వుండేది. ఆ రాష్ట్రాన్ని ఆ విధంగా మార్చింది కూడా లాలూప్రసాద్‌యాదవే! లాలూ, రబ్రీదేవిల హయాంలో ఆ రాష్ట్రం అవినీతి కుంభకోణాలతో, ఆటవిక పాలనతో ఎంతో వెనుకబడిపోయింది. పదేళ్ల క్రితం జేడీయు, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం, నితీష్ ముఖ్యమంత్రి కావడంతో ఆ రాష్ట్రంలో మార్పులు మొదలయ్యాయి. ఆటవిక రాజ్యంలో అభివృద్ధి పునాదులు పడ్డాయి. సంకీర్ణంలో భాగస్వామి అయినప్పటికి నితీష్‌ను బీజేపీ ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు. నితీష్ అభివృద్ధి అజెండా మూలంగానే 2010లో జరిగిన ఎన్నికల్లోనూ జేడియు-బీజేపీ కూటమి 200కు పైగా సీట్లు సాధించి, ఆర్జేడీని తుడిచిపెట్టినంత పని చేసాయి.

అయితే ఎన్డీఏలో వున్నప్పటికి నరేంద్రమోడీ అంటే నితీష్‌కు పడేది కాదు. గుజరాత్ అల్లర్లే దీనికి కారణం. 2013లో గోవాలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో నరేంద్రమోడీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడంతో నితీష్ అలిగి ఎన్డీఏతో తెగదెంపులు చేసుకోవడం జరిగింది. కాని 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లో బీజేపీ అత్యధిక లోక్‌సభ సీట్లను సాధించి నితీష్‌ను చావుదెబ్బ కొట్టింది. అవే ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయనే ఆశతో సర్వశక్తుల్లొడ్డిన బీజేపీకి భంగపాటు తప్పలేదు. బీహార్‌లో నితీష్ గెలుపుకు బీజేపీ ఓటమికి ప్రధాన కారణాలను విశ్లేషిద్దాం. నితీష్ సమర్ధవంతుడైన ముఖ్యమంత్రి. కులాలు, మతాలకతీతంగా ప్రజలు ఆమోదించిన నాయకుడు. గతంలో పనిచేసిన ముఖ్యమంత్రుల కంటే నితీష్ పరిపాలన ఎంతో మెరుగ్గా వుంది. రాష్ట్రంలో అభివృద్ధి పరంగా మార్పు కనిపిస్తుంది. నితీష్ పాలనలో ఎలాంటి అవినీతి కుంభకోణాలు లేవు. అరాచకాలు, మతకలహాలు లేవు. ఒకవేళ ఈ ఎన్నికల్లో ఆర్జేడీతో జత కట్టినా, లాలూ మీద అవినీతి మరకలున్నా ఆయన కూడా కాబోయే సీఎం నితీష్‌కుమారేనని ప్రకటించారు. నితీష్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడానికి ఎటువంటి కారణాలు లేవు. కాబట్టి ఆయనకు సానుకూల ఓట్లు పడ్డాయి. ఆర్జేడీ, కాంగ్రెస్ వంటి పార్టీలు ఆయన పక్కన చేరి లాభపడ్డాయి.

బీజేపీ వైపు నుండి చూస్తే ఆ పార్టీ ఇంకా లోక్‌సభ ఎన్నికల మూడ్‌లో నుండి బయటకు రానట్లే కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు వేరు... నరేంద్ర మోడీ ఇమేజ్ అక్కడితో అయిపోయింది. మన్మోహన్‌సింగ్ కంటే మంచి ప్రధాని అవుతాడని చెప్పి ఆ ఎన్నికల్లో మోడీకి ఓట్లేసారు. ప్రజలు ప్రధానిని దృష్టిలో పెట్టుకుని దేశ వ్యాప్తంగా కూడా ఒకటే విధంగా స్పందించారు. బీజేపీ నామమాత్రంగా వున్న రాష్ట్రాలలో సైతం బీజేపీకి సీట్లొచ్చాయంటే అదే కారణం. కాని రాష్ట్రాల ఎన్నికలు వేరు. ఢిల్లీలో బీజేపీ ప్రతిపాదించిన కిరణ్‌బేడీ కంటే అరవింద్ కేజ్రీవాల్ వైపే ఓటర్లు మొగ్గుచూపారు.

ఈరోజు బీహార్‌లో నితీష్‌కు ప్రత్యామ్నాయ రాష్ట్ర నాయకత్వాన్ని చూపలేకపోయింది బీజేపీ. మోడీని చూసి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లేయరు. బీజేపీ గెలిస్తే మోడీ బీహార్‌కొచ్చి సీఎం కాలేడుగా! ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేకపోవడం కూడా బీజేపీకి కలిసి రాలేదు. ముఖ్యమంత్రి స్థాయిలో సమర్దుడైన నాయకుడిని చూపలేకపోయారు. ఇక కులాలు, మతాలపరంగా తీసుకున్నా ఓట్లు నితీష్‌వైపే వున్నాయి. రాంవిలాస్ పాశ్వాన్, మాంఝీలను ఎక్కువుగా నమ్మి హెచ్‌ఏఎం, ఆర్ఎల్ఎస్‌పి, ఎల్‌జెపి పార్టీలకు 83సీట్లు కేటాయిస్తే వాటిలో గెలిచింది 5సీట్లే. బీజేపీ కనీసం ప్రతి మూడు సీట్లలో ఒకటన్నా గెలిచి పరువునిలబెట్టుకుంది.

ఈ ఎన్నికలు బీజేపీకి ఒక గుణపాఠమే. ఎందుకంటే ప్రతిదానికి మోడీ ఇమేజ్ మీద ఆధారపడకూడదనేది ఇప్పుడన్నా తెలుసుకోవాలి. ముఖ్యంగా ఆయా రాష్ట్రాల్లో బలమైన నాయకత్వాన్ని ఏర్పరచుకోవడంతో పాటు కేంద్రంలోనూ టీం వర్క్‌ను మెరుగుపరుచుకుంటేనే బీజేపీ నిలబడగలదు.

## న్యాయమైన తీర్పు



నితీష్ సమర్ధవంతుడైన ముఖ్యమంత్రి. కులాలు, మతాలకతీతంగా ప్రజలు ఆమోదించిన నాయకుడు. గతంలో పనిచేసిన ముఖ్య మంత్రుల కంటే నితీష్ పరిపాలన ఎంతో మెరుగ్గా వుంది. రాష్ట్రంలో అభివృద్ధి పరంగా మార్పు కనిపిస్తుంది. నితీష్ పాలనలో ఎలాంటి అవినీతి కుంభకోణాలు లేవు. అరాచకాలు, మతకలహాలు లేవు. ఒకవేళ ఈ ఎన్నికల్లో ఆర్జేడీతో జత కట్టినా, లాలూ మీద అవినీతి మరకలున్నా ఆయన కూడా కాబోయే సీఎం నితీష్‌కుమారేనని ప్రకటించారు. నితీష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడానికి ఎటువంటి కారణాలు లేవు.

---

### స్వయంసహాయక సంఘాలకు
## రివాల్వింగ్ ఫండ్ విడుదల

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 2014ఏప్రిల్ తరువాత ఏర్పాటు చేయబడిన అర్బన్ వెలుగు స్వయం సహాయక సంఘాలలో నిబంధనలకు అనుగుణంగా సంఘ సమావేశాలు, పొదుపును సక్రమంగా నిర్వహించుకున్న 191 మహిళా స్వయం సహాయక సంఘాలకు ఒక్కో సంఘానికి 10వేల చొప్పున 19,10,000 రూపాయల రివాల్వింగ్ ఫండ్ విడుదల చేయడం జరిగిందని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. 1వ టౌన్ లెవల్ ఫెడరేషన్ పరిధిలో 75 సంఘాలకు, 2వ టౌన్ లెవల్ ఫెడరేషన్ పరిధిలో 54సంఘాలకు, 3వ టౌన్ లెవల్ ఫెడరేషన్ పరిధిలో 44సంఘాలకు, సింహపురి టౌన్ వికలాంగుల ఫెడరేషన్ పరిధిలో 18సంఘాలకు రివాల్వింగ్ ఫండ్‌ను స్లమ్‌లెవల్ ఫెడరేషన్‌కు విడుదల చేయడం జరిగిందని తెలిపారు.

### ఆటోనగర్ కార్మికులకు
## హోమియో మందుల పంపిణీ




ఈ నెల 7వ తేదీన నెల్లూరు ఆటోనగర్‌లోని కార్మికులు డెంగీ వంటి విషజ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా బీజేపీ కార్మికులు 2500 మందికి హోమియో మందులు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ఈ ప్రాంతాల్లో పర్యటించి ఈ మందుల పంపిణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా ఇంజనీరింగ్ కంపెనీ రాము, ప్రొక్లెయిన్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఏసు, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, మణి, మల్లి, కృష్ణ, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే టికెట్ రద్దు ఛార్జీలు పెంపు

రైల్వే రిజర్వేషన్ టికెట్ రద్దు ఛార్జీలను ఒక్కసారిగా రెండింతలు పెంచారు. ఈ ఛార్జీలు ఈ నెల 12 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆర్ఏసి ప్రయాణీకులు టికెట్టు రద్దు చేసుకుంటే ప్రస్తుతం రూ.30 ఛార్జీ వసూలు చేస్తుండగా, రూ.60కు పెంచారు. ప్రస్తుతం రైలు బయలుదేరడానికి అరుగంటలు ముందు, బయలుదేరిన రెండు గంటల తర్వాత టికెట్టు రద్దు చేసుకుంటే 50శాతం నగదు చెల్లించే సదుపాయం వుంది. ఈ సదుపాయాన్ని రైలు బయలుదేరడానికి 12గంటల ముందు, బయలుదేరిన 4గంటల తరువాత రద్దు చేసుకునేలా చేసారు. నాలుగు గంటలు పొడిగించడం ద్వారా వెయిటింగ్‌లిస్ట్ ప్రయాణీకులకు బెర్తులు ఇవ్వాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 48గంటల ముందు రద్దు చేసుకున్న నిర్ధారిత ఒకటవ తరగతి ఏసి టికెట్ పై రూ.120 ఛార్జీ వసూలు చేస్తున్నారు. కొత్తగా ఈ ఛార్జీలను రూ.240కు పెంచారు. రెండవ తరగతి ఏసి టిక్కెట్టు రద్దు ఛార్జీలు రూ.90 నుండి రూ.180 చేశారు. స్లీపర్ క్లాస్ టిక్కెట్‌పై రూ.60 నుండి 120కి, సెకెండ్‌క్లాస్‌పై రూ.30 నుండి రూ.60కి పెంచారు. రైల్వేశాఖ టికెట్ రద్దు ఛార్జీలను పెంచడంపై ప్రయాణీకుల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

---




## ఈ ముగ్గురే భాగస్వాములు

రాజధాని నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని, చందాలు దండుతున్నాడు చంద్రబాబు. అసలు రాజధాని నిర్మాణానికి కారకులెవరో వారే రాజధాని నిర్మాణానికి అయ్యే ఖర్చు భరించాలి. తెలంగాణ ఇచ్చిన క్రెడిట్ పొందాలని పోటీపడ్డ కాంగ్రెస్, బీజేపీలు, కేంద్రంలో అధికారంలో వున్న పార్టీతో జత కట్టి ఏదో ఒక విధంగా సమైక్య రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని కలలు కంటూ తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇచ్చిన చంద్రబాబు ఈ ముగ్గురే భాగస్వాములు కావాలి. మొదటి చందా సోనియా, రెండవ చందా ప్రధాని మోడీ(ప్రత్యేక హోదా రూపంలో, ప్యాకేజీ రూపంలో కాదు), మూడవ చందా బాబుది. బాబు చందా సంగతి దేవుడెరుగు! ప్రజాధనం దుబారా చేయకుంటే అదే పదివేలు. వెంకయ్యనాయుడు మోడీని పొగడటం మాని రాజధాని నిర్మాణానికి సహకరించాలి.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## బీహార్ ఒక గుణపాఠం

ప్రధాని నరేంద్ర మోడీకి బీహార్ అసెంబ్లీ ఫలితాలు ఒక గుణపాఠం కావాలి. అద్వానీ వంటి సీనియర్లను పక్కనపెట్టి నియంతృత్వ ధోరణితో పోయినందుకు ఫలితమిది. వాజ్‌పేయి ప్రధానిగా వున్నప్పుడు కేంద్రంలో టీమ్‌వర్క్ కనిపించేది. ఇప్పుడు మాత్రం కేంద్రంలో నరేంద్ర మోడీ జపం పెరిగింది. పార్టీ కంటే వ్యక్తిగత భజన ఎక్కువైంది. వెంకయ్యనాయుడు లాంటి స్వార్థపరులు మోడీని తప్పుదారిలో నడిపిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కోవాలి.

**- జి.కొండారెడ్డి, పాములూరు.**

## ట్రాఫిక్ నిబంధనలు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలన్న నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలి. లేకుంటే పెనాల్టీలు వేయాలి. బైక్‌లలో ట్రిబుల్స్ రైడింగ్‌ను నిరోధించాలి. ఆటోలలో డ్రైవర్ల పక్కన ప్రయాణీకులు కూర్చోవడాన్ని అరికట్టాలి. దీనివలన ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.

**- అలూరి ఆత్మనందం, నెల్లూరు.**

## విడవలూరు పీర్ల చావిడి

విడవలూరులో కొన్ని వందల సంవత్సరాల నుండి పీర్ల చావిడి వుంది. గ్రామ సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామ సభలు, ఉత్సవాలు అక్కడే జరిగేవి. ఇదిప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ స్థలం కబ్జా అవుతోంది. ఇక్కడ పెట్టిన బంకులను తొలగించాలి. జడ్పీ ఛైర్మెన్, ఎంపీలు నిధులు కేటాయించాలి. కలెక్టర్, జడ్పీ సిఇఒలు దీనిని గురించి పట్టించుకోవాలి.

**పూండ్ల అచ్యుత్‌రెడ్డి, విడవలూరు.**




# కమలంపై కూర్చునేదెవరు?

***కేంద్రంలో బీజేపీ అధికారంలో వుంది. రాష్ట్రంలోనూ అధికారంలో భాగస్వామిగా వుంది. కాబట్టి రాష్ట్రంలో పెద్దగా కేడర్ లేకపోయినా ఆ పార్టీ లీడర్‌గా మాత్రం చెలామణి కావచ్చు. ఈ ఆలోచనతోనే బీజేపీ జిల్లా అధ్యక్షపదవి కోసం గట్టిపోటీ నెలకొంది.***

ఈ నెలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి వుంది. గత కొన్నేళ్లుగా అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ వస్తున్నారు. ఈసారి కూడా అదే తరహా ఎన్నికకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కొత్త అధ్యక్షుడు ఎవరనే దానిపైనే మల్లగుల్లాలు పడుతున్నారు. ముఖ్యంగా జిల్లా వాసి, బీజేపీ జాతీయ నాయకులు, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ఎవరిని కరుణిస్తే వాళ్ళే అధ్యక్షులవుతారనేది నిర్వివాదాంశం.

ప్రస్తుత అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మరోమారు అధ్యక్ష పీఠంపై కొనసాగేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సురేంద్రరెడ్డి హయాంలో జిల్లాలో పార్టీ బలపడింది లేదు, అలాగని కొత్తగా బలహీనపడిందీ లేదు. అయితే ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, అందరితో సమన్వయంతో ఉంటూ ఆయన నెట్టుకొచ్చాడు.

బలహీనవర్గాలకు చెందిన మిడతల రమేష్ కూడా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నాడు. గతంలో ఒకసారి పార్టీ నుండి బయటకెళ్లి మళ్లీ బీజేపీలో చేరాడు. ఈమధ్య సాగునీటి సమస్యలపై పార్టీ పరంగా కొన్ని కార్యక్రమాలు కూడా చేస్తున్నాడు. అయితే పార్టీలో ఆయనంటే కొందరికి గిట్టని పరిస్థితులున్నాయి.

సీనియర్ నాయకుడైన కర్నాటి ఆంజనేయరెడ్డి పేరు కూడా అధ్యక్ష పదవికి వినిపిస్తోంది. గతంలోనే ఆయన అధ్యక్ష పదవికి ప్రయత్నించినప్పటికి కొందరు రాకుండా అడ్డుకున్నారు. ఈసారి ఆయన అధ్యక్ష పదవి కోసం బలమైన ప్రయత్నాలేవీ చేయడం లేదు గాని ఇస్తే మాత్రం చేయడానికి సిద్ధంగా వున్నాడు. త్వరలోనే కమల పీఠంపై కూర్చునేదెవరో తేలబోతోంది.

● కోవూరు...

# ముమ్మరమైన పిఎస్ఆర్‌ల పోరు




***కోవూరు నియోజకవర్గం తెలుగుదేశంపార్టీలో అంతర్గత విభేదాలు, కుమ్ములాటలు ఎక్కువయ్యాయి. తమ్ముళ్ల పోరు బహిరంగంగానే జరుగుతోంది. ఆరోపణలు, విమర్శలు చేసుకోవడంలో ఎక్కడా దాపరికం లేదు. బహిరంగంగానే కుమ్ముకుంటున్నారు.***

ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఏకపక్ష నిర్ణయాలపై ఆయన వ్యతిరేక వర్గమైన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి వర్గీయులు బహిరంగ దాడికి దిగినట్లుగా తెలుస్తోంది. పార్టీలో ఎప్పటి నుండో కనిపెట్టుకుని వున్న తమను కాదని ఎమ్మెల్యే పోలంరెడ్డి కాంగ్రెస్ నుండి వచ్చిన వాళ్లకు ప్రాధాన్యతనిస్తున్నారంటూ పెళ్లకూరు అనుచరులు అధిష్టానానికి, పార్టీ పరిశీలకులకు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తున్నారు. పోలంరెడ్డి మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా అంతా నా ఇష్టం అనే రీతిలో తన పంథాను అనుసరిస్తున్నారు. 2014 ఎన్నికల్లో కోవూరు టిడిపి సీటుపై పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 2009 ఎన్నికల అనంతరం నల్లపరెడ్డి ప్రసన్న పార్టీ వదిలి పోవడం తెలిసిందే! ఆ సమయంలో ఇక్కడ పార్టీకి నాయకుడు కరువయ్యాడు. 2012లో జరిగిన కోవూరు ఉపఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా ఎవరూ లేక సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నిలబడ్డాడు. ఆ ఎన్నికల తర్వాత కోవూరు రాజకీయాల్లో పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి కీలకపాత్ర పోషించారు. ప్రతిపక్షంలో వున్నా పార్టీ కేడర్‌కు అన్ని విధాలుగా అండగా నిలిచారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పర్యటనలు చేస్తూ తన సొంత వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 2014లో ఇక సీటు అతనికే ఖాయం అనుకున్న తరుణంలో కాంగ్రెస్‌లో వున్న పోలంరెడ్డి తెలుగుదేశంలో చేరి టిక్కెట్ ఎగరేసుకుపోయాడు. పెళ్లకూరుకు నోటిదాకా వచ్చిన సీటు చేజారినట్లయ్యింది. ఆ ఎన్నికల్లో పోలంరెడ్డి విజయ సాధించడం తెలిసిందే!

ఇక యధాఫలంగా అక్కడి నుండి ఇరువర్గాల వారి మధ్య అంతర్యుద్ధం మొదలైంది. నామినేటెడ్ పదవుల్లో గాని, పార్టీ కమిటీలలోగాని, పనుల కేటాయింపులోగాని పోలంరెడ్డి తనతో పాటు కాంగ్రెస్‌ను వీడి వచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తున్నాడు. ఇది అంతకుముందు నుండి పార్టీని నమ్ముకుని వున్న పెళ్లకూరు అనుచరులకు మింగుడు పడడం లేదు. ముందొచ్చిన చెవులకన్నా వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లుగా తమ పరిస్థితి తయారైందని వారు వాపోతున్నారు. రాజకీయాల్లో ముందూ, వెనుక అని వుండదు. చంద్రబాబు కంటే ముందే తెలుగుదేశంలో చాలా మంది వున్నారు. వాళ్లకంటే వెనుకొచ్చిన చంద్రబాబుకు పార్టీ సీఎం కుర్చీ అప్పగించలేదా?! రాజకీయాలలో అసలు సూత్రం ఇదే!

# పడకేసిన పరిపాలన

**- సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి**

రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా తయారైందని, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం నెల్లూరు పొదలకూరురోడ్డులోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ పొదలకూరు మండలంలో నిమ్మ, మిరప పంటలకు నీరందించేందుకు రూ.67.44లక్షలను 2015లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే కాంట్రాక్టర్లు పథకం ప్రకారం దోపిడీకి పాల్పడగా సాక్ష్యాధారాలతో రైతులు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం అవినీతిపై ప్రాథమిక సమాచారం ఉందని అభిప్రాయ పడిందన్నారు. అవినీతికి తోడ్పడిన ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించదని తెలిపారు. కండలేరు తాత్కాలిక ఎత్తిపోతల పథకం అవినీతిపై నిజాయితీగల వ్యక్తుల కమిటీతో విచారణ జరిపించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించిందన్నారు. కోర్టు తీర్పును వివరిస్తూ సిఎంను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించిన వారిపై చంద్రబాబుకు బహిరంగ లేఖ వ్రాసానన్నారు. జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తుంటే జిల్లా



ప్రధాన ఆసుపత్రిలో వున్న 10శాతం వైద్యులతో రోగులకు ఎలా మెరుగైన వైద్యసేవలందిస్తారని ప్రశ్నించారు. పింఛన్ల పంపిణీలో జన్మభూమి కమిటీ సభ్యులు అవినీతికి పాల్పడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రూప్‌కుమార్‌యాదవ్, అధికార ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా బిసి సంఘం అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యుడు వెంకటశేషయ్య పాల్గొన్నారు.



# ‘నుడా’లో కదలిక

***గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చింది. అయితే వై.యస్. మరణం తర్వాత అది తెరమరుగైంది. గత ఏడాది తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక తెరపైకి మళ్లీ ‘నుడా’ ప్రతిపాదన వచ్చింది. మొదట 36మండలాలను కలిపి ‘నుడా’ను ప్రతిపాదించారు.***

జిల్లాలో ఉండేది 46మండలాలు. 36మండలాలను కలిపితే ముప్పావు భాగం జిల్లాను ‘నుడా’ పరిధిలోకి తెచ్చినట్లే! అంటే ఉదయగిరి వంటి మెట్ట ప్రాంతం తప్పితే మిగతా జిల్లా అంతా నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో వుంటుంది. అయితే ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరించినట్లు తెలుస్తోంది. నెల్లూరు పరిసరాలలో వున్న 18మండలాలలను కలిపి ‘నుడా’ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఒకేసారి ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. త్వరలోనే ‘నుడా’ కార్యరూపం దాల్చనున్నట్లు సమాచారం.

# మినుమును మింగేసిన కరువు



***ఉదయగిరి వంటి మెట్ట ప్రాంతాల్లో మినుములు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పెసర, పొగాకు వంటి వాణిజ్య పంటలే ఎక్కువ. ఈసారి మెట్ట రైతులను పొగాకు నిలువునా ముంచింది. పంట వచ్చినా కొనేవాళ్లు లేక పొగాకు పండించిన రైతులు డీలా పడిపోయారు.***

ఇప్పుడు మినుము రైతుల పరిస్థితి అంతకంటే అధ్వాన్నంగా వుంది. మార్కెట్‌లో మినపప్పు ధర కిలో 180రూపాయలైంది. మినుము చేతికొస్తే మంచి లాభాలుంటాయనే ఆశతో రైతులు వేలాది ఎకరాల్లో మినుము సాగు చేసారు. ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి మండలాలలో వేలాది ఎకరాల్లో ఈ పంట వేశారు. కొందరు రైతులైతే తమ సొంత భూముల్లోనే కాక వందల ఎకరాలను కౌలుకు తీసుకుని మరీ వేసారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. గత నెలాఖరులోనన్నా నాలుగు చినుకులు పడుంటే వేసిన పంటలు సగం విస్తీర్ణమన్నా బ్రతికుండేది. కాని నిన్నటి వరకు ఎండలు దారుణంగా కాసాయి. నీళ్లు లేక వేలాది ఎకరాలలో మినుము పంట నిలువునా ఎండిపోయింది. అప్పులు చేసిన రైతుల పరిస్థితి దారుణంగా మారింది.

● అక్రమాల కార్పొరేషన్‌లో...


# అవినీతి కృష్ణయ్య లీలలు

నెల్లూరు నగరపాలక సంస్థలో బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ పోట్ల కృష్ణయ్య అంటే కమిషనర్ కన్నా పవర్‌ఫుల్. కార్పొరేషన్‌లో ఆయనకు తెలిసినన్ని లోతుపాతులు ఇంకెవరికీ తెలియవు. అతను అనుకుంటే అక్రమ నిర్మాణం సక్రమం కావాల్సిందే! సక్రమ నిర్మాణమైనా నేలకూలాల్సిందే! ఇలా రాజ్యమేలిన కృష్ణయ్యపై ఏసిబి అధికారుల కన్ను పడింది. ఈ అవినీతి కృష్ణయ్యను తమ బంధాలలో బిగించేసారు.

ఈనెల 9వతేదీన నెల్లూరు నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ ట్రేసర్, ఇన్‌ఛార్జ్ బిల్డింగ్ అధికారిగా పనిచేస్తున్న పోట్ల కృష్ణయ్య ఇళ్లపై ఏసిబి దాడులు జరిగాయి. నెల్లూరు, నేతాజీనగర్ లోని 4వ వీధిలో బాలాజీ గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లోని అతని నివాసంలో ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్, పివివిఎస్‌మూర్తి, సిఐ శివకుమార్ రెడ్డిల బృందం సోదాలు చేపట్టింది. అదే సమయంలో హైదరాబాద్ మల్కాజ్‌గిరిలోని కృష్ణయ్య ఇంట్లో అక్కడి ఏసిబి డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, ఇన్స్‌పెక్టర్ సుదర్శన్‌రెడ్డిలు, బెంగుళూరు, భోగన్‌హల్లిలోని నివాసంలో తిరుపతి డిఎస్పీ శంకర్‌రెడ్డి, సిఐ సుధాకర్‌రెడ్డిలు సోదాలు చేపట్టారు. ఈ సోదాలలో నెల్లూరులో మూడు ఇళ్లు, హైదరాబాద్‌లో రెండు ఇళ్లు, బెంగుళూరులో ఒక ఇల్లుతో పాటు మరో ఇంటికి 46లక్షలు అడ్వాన్స్ ఇచ్చినట్లుగా గుర్తించారు. అలాగే కెనరా బ్యాంకులో 77 లక్షలు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో 10లక్షలు, ఇతర బ్యాంకుల్లో 15లక్షలు డిపాజిట్లు, అలాగే 5లక్షల బ్యాంకు బ్యాలెన్సును గుర్తించారు. మొత్తానికి కృష్ణయ్య ఆదాయానికంటే అవినీతి ఆస్తులు ఎక్కువుగా వున్నట్లు ఏసిబి వాళ్లు కనిపెట్టారు. కృష్ణయ్య మున్సిపాలిటిలో 1983లో ఎన్ఎంఆర్‌గా చేసారు. వాచ్‌మెన్, అటెండర్, రికార్డ్ అసిస్టెంట్... ఇలా ఒక్కో మెట్టు దాటుకుంటూ ఇన్‌ఛార్జ్ టౌన్‌ప్లానింగ్ అధికారి స్థాయికొచ్చారు. కృష్ణయ్య మీద ఎప్పటి నుండో అవినీతి ఫిర్యాదులున్నాయి. అతని మీద పక్కాసమాచారంతోనే ఏసిబి దాడికి దిగింది.

# నెల్లూరు కబుర్లు

## కండలేరుకు సీఎం



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 21వ తేదీన రాపూరు మండలంలోని కండలేరు రిజర్వాయర్ వద్దకు వస్తున్నారు. ఉదయం 10గంటలకు కండలేరు రిజర్వాయర్‌లో తిలాపియా చేపపిల్లలను వదిలి గేజ్ కల్చర్ ప్రారంభిస్తారు. 10గంటలకు అక్కడే జరిగే బహిరంగ సభలో మత్స్యకారులకు సైకిళ్లు, వలలు, బోట్లు పంపిణీ చేస్తారు. అయితే అదేరోజు కృష్ణపట్నం పోర్టు పరిధిలో జరిగే మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలలోనూ ఆయన పాల్గొననున్నారు.

## మూడో లైన్ క్లియర్

నెల్లూరు-గూడూరుల మధ్య మూడో రైల్వేలైన్ ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ ముగిసిందని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ అడిషనల్ డిఎం వేణుగోపాల్ వెల్లడించారు. ఈ నెల 7న నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ లైన్ పూర్తయితే రైళ్ల రాకపోకలు మరింత సులభతరంగా ఉంటుందన్నారు. ప్రయాణీకులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ఏ కేటగిరి రైల్వేస్టేషన్‌లలో ఈ కేటరింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. 1800 1034139కు ఒక్క ఫోన్ చేసి ఆర్డరిస్తే ప్రయాణీకుడి బెర్త్ దగ్గరకే వెజ్, నాన్‌వెజ్ భోజనం వస్తుందన్నారు. రైళ్లలో సౌకర్యాలు, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాలపై ఫిర్యాదులకు 138 కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని ఏ-గ్రేడ్ స్టేషన్‌లలో వైఫై సౌకర్యం కల్పిస్తున్నామని, మంచినీటి ప్లాంట్లను పెడుతున్నామని చెప్పారు. రైళ్లలో మహిళా ప్రయాణీకుల భద్రత కోసం 132మంది ఆర్పీఎఫ్ మహిళా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజల అవసరాలు, సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని సింహపురి ఎక్స్‌ప్రెస్ వేళలను మార్చడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ సమావేశంలో ఏసిఎం రాజశేఖర్, ఏడిఇ కనకశైలేష్, స్టేషన్ మేనేజర్ షాజహాన్, సిసిఎం మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 13న బ్రాహ్మణ వివాహ పరిచయవేదిక

ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్, బ్రాహ్మణ జాగృతి అంతర్జాతీయ సంస్థ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 13న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయవేదికను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రామచంద్రరావు తెలిపారు. 7వ తేదీ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నెల్లూరు టౌన్‌హాల్ వర్ధమాన సమాజంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వధూవరుల తల్లిదండ్రులు బాలాజీనగర్ కొప్పరపు వారివీధిలో ఉన్న కార్యాలయంలో పేర్లను నవంబర్ 25లోగా నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99850 57782 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో నెల్లూరుజిల్లా శాఖ శాశ్వత సభ్యుడు లక్ష్మీ నరశింహారావు, సర్వేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు సర్వేపల్లి రామ్మూర్తి పాల్గొన్నారు.

## రెయిన్‌బోలో ఫ్యాన్సీ డ్రస్ పోటీలు



ఈనెల 7న నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో స్కూల్ నందు ఎల్‌కెజి విద్యార్థులకు 'సమాజ సహాయకులు' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు టీచర్, డాక్టర్, పండితుడు, చెప్పులు కుట్టే వారు, కూలీ, పాలు అమ్మేవాళ్లు, కూరగాయలు అమ్మేవాళ్లు, పోలీసు.. ఇలా వివిధ వేషధారణలతో అలరించడమే కాక ప్రతి వృత్తిజీవన భృతి కోసమే కాకుండా పరోక్షంగా వాళ్లంతా సమాజసేవ చేస్తున్నారనే సందేశమిచ్చారు. ఈ పోటీలను పాఠశాల డైరెక్టర్ శ్రీమతి యం.పద్మా సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జ్ శ్రీమతి ఫాతిమాఖాన్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

## శ్రీకాళహస్తికి హైవే రైడర్స్

నెల్లూరు నుండి శ్రీకాళహస్తికి మధ్య 12 హైవే రైడర్స్ బస్సులను ప్రవేశ పెట్టారు. నెల్లూరు నుండి శ్రీకాళహస్తికి పోవాలనుకునే ప్రయాణీకులకు బస్సులు తక్కువుగా వుంటున్నాయి. దీనికి కారణం నెల్లూరు - తిరుపతిల మధ్య నాన్‌స్టాప్ బస్సులు ఎక్కువుగా వుండడమే. ఇవి శ్రీకాళహస్తి మీదుగా పోతున్నప్పటికీ శ్రీకాళహస్తి బస్టాండ్‌లోకి పోవు. బైపాస్ మీదుగా వెళతాయి. ఇది ప్రయాణీకులకు ఇబ్బందిగా వుండేది. ఇప్పుడు నెల్లూరు నుండి ప్రతి అరగంటకు శ్రీకాళహస్తికి బస్సు ఏర్పాటు చేసారు. ఇవి శ్రీకాళహస్తి దేవాలయం దాకా వెళతాయి.

## ఎమ్మెల్యేకు కరెంట్ షాక్

నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ తృటిలో విద్యుత్ ప్రమాదం నుండి తప్పించుకున్నారు. జోరువానల నేపథ్యంలో నెల్లూరు విఆర్‌సి గ్రౌండ్‌లో టపాసుల అంగళ్లు పెట్టుకున్న వాళ్లను పరామర్శిద్దామని అనిల్ అక్కడకు వెళ్లారు. దుకాణదారులతో మాట్లాడి వారి సమస్యలను చెప్పేందుకు ఆర్టీఓకు ఫోన్‌చేసి మాట్లాడుతుండగా కరెంట్ తీగ తగిలి షాక్ కొట్టింది. వెంటనే ఆయన అప్రమత్తమై దూరంగా జరగడంతో ప్రమాదం తప్పింది.

## కార్తీక సందడి మొదలైంది

హిందువులకు అత్యంత పవిత్రమైన కార్తీక మాసం మొదలైంది. జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ కూడా భక్తుల రద్దీతో కళకళలాడుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, నవాబుపేట, సంతపేట, ఉస్మాన్‌సాహెబ్‌పేట శివాలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ఇక ఈ నెలంతా కూడా నాన్‌వెజ్ వ్యాపారాలు డల్‌గా వుంటాయి.

## 16న దుప్పట్లు పండుగ

నెల్లూరు మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురునిలయం భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి సన్నిధిలో ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయం పేదలకు, వృద్ధులకు, అనాథలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీవారి పాద రేణువు మాకాని వెంకట్రావు తెలిపారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి దివ్య ఆశీస్సులతో ప్రతి సంవత్సరం విధిగా శీతాకాలం దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని దాతల సహాయంతో నిర్వహిస్తున్నట్లు, ఈ యేడాది కూడా నెల్లూరుజిల్లాలోని అనాథ ఆశ్రమాలకు, వృద్ధులు, వికలాంగులు, అంధుల ఆశ్రమాలకు దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వెంకట్రావు తెలిపారు.

## కార్తీక మహోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

కార్తీక మహోత్సవాలను వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 12 నుండి డిసెంబర్ 11 వరకు కార్తీక మహోత్సవాలు జరగనున్న నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సోమవారం ఆలయ ప్రాంగణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి, పోలీసు, నగరపాలక సంస్థ, విద్యుత్, అగ్నిమాపక అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని కోరారు. విఐపిలకు మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటి గంట వరకు, సాయంత్రం 5గంటల నుండి ఆరుగంటల వరకు దర్శనం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, కార్పొరేటర్లు రూప్‌కుమార్‌యాదవ్, నాగరాజు, మాధవయ్య, శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది రజతోత్సవ వేడుకలు



పోలీసు శాఖలోకి ప్రవేశించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిబ్బంది రజతోత్సవ వేడుకలను జరుపుకున్నారు. 1990లో కానిస్టేబుళ్లుగా పోలీసు శాఖలో నియమితులైన సిబ్బంది ఆత్మీయ సమావేశాన్ని నెల్లూరు లోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. దాదాపు 85మంది సిబ్బంది సమా వేశంలో పాల్గొని తమ అనుభవాలను, కుటుంబ పరిస్థితులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా అందరూ కలిసి కట్టుగా పరిష్కరించుకుందామని తీర్మానం చేశారు. అప్పటి కానిస్టేబుళ్లు, ప్రస్తుత సిఐలు బాజీజాన్ సైదా, పెంచలరెడ్డి ఆత్మీయ సమావేశంలో పాల్గొనడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. వారిని శాలువాలతో సత్కరించారు.

అనంతరం ప్రతి ఒక్కరికి మెమెంటోలు అందజేశారు. పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరి శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

## నారా లోకేష్ సేవాసమితి నూతన కార్యవర్గం

నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ జరిగిన నారా లోకేష్ సేవాసమితి కార్యవర్గ సమావేశంలో టిడిపి నాయకులు, నెల్లూరు జిల్లా, మండల కమిటీలను ఎంపిక చేశారు. నారా లోకేష్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడిగా మోచర్ల మధు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కృష్ణశేఖర్, శివను ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శులుగా వినయ్‌చౌదరి, రాజేంద్రకుమార్, కార్యదర్శులుగా శ్రీనివాసులు, బాబునాయుడు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శిగా రమేష్, ఆఫీసు ఇన్‌ఛార్జిగా సురేష్, కోశాధికారిగా మస్తానయ్యను ఎంపిక చేశారు.

## 150కోట్ల మార్క్ దాటాం

- మెట్టుకూరు



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అక్టోబర్ నెలాఖరుకు 152కోట్ల డిపాజిట్లను సేకరించిందని ఆ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి తెలిపారు. నాబార్డ్ సౌజన్యంతో బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన తొలి ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ఈ నెల 6న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించడానికే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసామన్నారు. త్వరలో కావలి, సూళ్లూరుపేట, నాయుడుపేట, నెల్లూరు రామ్మూర్తినగర్ బ్రాంచ్‌లలో కూడా ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. త్వరలో ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు వంటి మెట్ట ప్రాంతాల్లో కూడా వీటిని నెలకొల్పుతామన్నారు. రైతు వివేక పథకం క్రింద స్వల్పకాలిక, దీర్ఘకాలిక, వ్యవసాయ అనుబంధ ఋణాలను ఇప్పటిదాకా 32కోట్లు మంజూరు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిజిఎం రమేష్‌బాబు, బ్యాంక్ సిఇఓ రమణారెడ్డి, ఆప్కాబ్ నోడల్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి, డిజిఎం ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.




9వ వర్ధంతి

మా కంటి వెలుగు, మా ఇంటి మహాలక్ష్మి

శ్రీమతి అళహరి నాగరాజేశ్వరమ్మ గారు

పరమపదించి 2015, నవంబర్ 18వ తేదీకి 9సంవత్సరాలు నిండుతాయి.

ఆమె తీపి జ్ఞాపకాలను సంస్మరించుకుంటూ కన్నీటి నివాళి అర్పిస్తున్నాం.

భర్త: అళహరి సత్యనారాయణ

మరియు కుటుంబసభ్యులు

# నగరంలో నారాయణ హల్‌చల్

## • రాత్రి వానొచ్చింది... పగలు మంత్రొచ్చాడు

భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి పి.నారాయణ 10వ తేదీ ఉదయం నెల్లూరు నగరంలో విస్తృతంగా పర్యటిం చారు. భారీవర్షాలకు దెబ్బతిన్న ప్రాంతా లను, నీట మునిగిన ఇళ్లను, కూలిన చెట్లు, స్థంభాలను పరిశీలించారు. మన్సూర్‌నగర్, మాగుంట లే అవుట్, ఖుద్దూస్ నగర్, కొండాయపాలెంరోడ్డు, బి.వి.నగర్ తదితర ప్రాంతాల్లో మంత్రి సుడిగాలి పర్యటన జరిపారు. భారీవర్షాలకు ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని, సహాయక చర్యలను సత్వరం చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటన మాటేమో గాని ఆయన కాన్వాయ్‌లో దాదాపు 20 కార్లు వచ్చాయి. అదో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లా వుండింది. మేయర్ అబ్దుల్ అజీజ్, కలెక్టర్ యం.జానకితో పాటు కమిషనర్ పివిఎస్ఎన్ మూర్తి, కార్పొ రేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



**నీళ్లను పొదుపుగా వాడుకుందాం**

జిల్లాలో వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా డెల్టా మరియు నాన్‌డెల్టా ప్రాంతాలలో అవసరమైన పంటలు వేసేందుకు తగిన ప్రణాళికలు రూపొం దించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. 10వ తేదీ నెల్లూరు, చింతారెడ్డిపాలెంలోని నారా యణ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఈపాటికి సోమశిలలో 45.69టిఎంసీల నీళ్లుండగా ఇప్పుడు కేవలం 14.6టిఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయన్నారు. అందులో తాగునీటికి 5టిఎంసీలు, డెడ్ స్టోరేజ్ 7.5టిఎంసీలు పోగా మిగతా నీళ్లను సాగునీటి అవసరా లకు వాడుకోవాల్సి వుంటుందన్నారు. అలాగే గతేడాది కండలేరులో 25.6 టిఎంసీలుండగా ఈ సంవత్సరం 5.37 టిఎంసీలు మాత్రమే ఉన్నాయన్నారు. వర్షపాతాన్ని, అందుబాటులో వున్న నీటిని బేరీజు వేసుకుని నాన్‌డెల్టా ప్రాంతంలో ప్రత్యామ్నాయ పంటలను వేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారు లను ఆదేశించడం జరిగిందన్నారు.



# క్రీడా పరికరాల పంపిణీ

ఈనెల 6న నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని 305 పాఠశాలలకు క్రీడా పరికరాలను విద్యార్థులకు అందించారు. ప్రతి పాఠశాలకు రూ.3000 విలువ కలిగిన క్రీడా పరికరాలు అందించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో జిల్లా ప్రజాపరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సిఇఓ బి.రామిరెడ్డి, డిఇఓ డి.ఆంజనేయులు, డిఎస్‌డిఓ ఎతిరాజులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## రోటరీ శ్మశాన వాటికలో

# రెండవ బర్నింగ్ షెడ్‌కు భూమిపూజ

నెల్లూరులోని రోటరీ శ్మశాన వాటికలో ఇటీవల రెండవ బర్నింగ్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ జరిగింది. ఈ సందర్భంగా రోటరీ శ్మశాన వాటిక కార్యదర్శి, రోటరీ క్లబ్ అధ్యక్షులు కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 2006లో రోటరీ క్లబ్ సుమారు 80లక్షల రూపాయల ఖర్చుతో శ్మశాన వాటికలో ఒక బర్నింగ్ షెడ్ నిర్మించిందన్నారు. ఆ షెడ్ సరిపోనందు వల్ల రెండవ బర్నింగ్‌షెడ్‌ను సుమారు 50 లక్షల రూపాయలు ఖర్చుతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. షెడ్ నిర్మాణానికి దాతలు 32లక్షల రూపాయలు విరాళంగా అంద జేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్మశాన వాటిక ఛైర్మెన్ రాఘవేంద్రషెట్టి, వైస్‌ఛైర్మెన్ సాదు నరశింహారావు, పిడిజి దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి సుబ్బా రెడ్డి, రామకృష్ణారెడ్డి, కె.వి.సుబ్రహ్మణ్యం, వి.వి.కృష్ణారెడ్డి, దొరస్వామినాయుడు, వెంకటేశ్వర్లు, నారాయణ, జయప్రకాష్, సనత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



# అభివృద్ధికి శివారు కాలనీలేనా?

నగర కార్పొరేషన్ పరిధిలో శివారున వుండే కాలనీలు అభి వృద్ధి పరంగా కూడా శివారున ఉండాల్సిందేనా? అని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ నెల 10వ తేదీన 32వ డివిజన్‌లోని లాయర్స్ కాలనీ, కావేరి నగర్ లలో ఆయన పర్యటించి జల మయమైన వీధులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాం తాలు కనీస వసతులు లేక అత్యంత అధ్వాన్నంగా ఉంటున్నాయన్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్లు జలమయం అవుతున్నాయని, రోడ్లు పూర్తిగా గుంటలు పడి ప్రజలు నడిచే పరిస్థితి లేకుండా పోతుందని, డ్రైనేజీ, వీధిలైట్లు కూడా లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. శివారు ప్రాంతాల కాలనీలన్నీ తన నియోజకవర్గంలోనే ఉన్నాయని, వీటి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన కమిష నర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వంశీ, నవీన్‌రెడ్డి, గౌస్‌బాషా, ముక్తియార్, ఖాదర్, మధురెడ్డి, కర్నాల సుబ్బారావు, పద్మనాభరెడ్డి, మాబాషా, చిరంజీవి పాల్గొన్నారు.



ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## మళ్లీ మొదలైన

# హెల్మెట్ ఆట

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్న నిబంధనను మళ్లీ ఈ నెల 12వ తేదీ నుండి అమలులోకి తెచ్చారు. మొదట ఆగష్టు 1 నుండి హెల్మెట్ తప్పని సరని చెప్పారు. తర్వాత అక్టోబర్‌కు, ఆ తర్వాత నవంబర్ వరకు వాయిదావేసారు. నవంబర్ 1 నుండి కూడా అమలు చేయ కుండా ఈ 12రోజులు గ్యాప్ ఇచ్చారు. దీపావళి కానుకగానేమో ఈ నెల 12 నుండి అమలులోకి తెచ్చారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేసారు. బండి నడిపే వాళ్లే కాకుండా వెనుక కూర్చున్నోళ్లు కూడా పెట్టుకోవాలని కండీషన్ పెట్టారు. అంటే ప్రతి బండి ఓనరు రెండు హెల్మెట్‌లను కొని పెట్టుకుని వుండాలి. హెల్మెట్ పెట్టు కోవడం ఒక ఆటగా మారింది. ఇది ద్విచక్రవాహనదారుల ప్రాణరక్షణ కోసం అమలు చేస్తున్నట్లుగా లేదు. హెల్మెట్ తయారీ కంపెనీల అమ్మకాలు పెంచేందుకు చేస్తున్నట్లుంది. ప్రజల ప్రాణాల మీద అంత శ్రద్ధ వుంటే తప్పనిసరిగా తలకు హెల్మెట్లు తగిలించడమే కాదు, సిగరెట్లు, మద్యం వంటివి కూడా నిషేధించాలని, వీటి వల్ల కూడా ఆరోగ్యాలు పాడై ప్రజల ప్రాణాలు పోతున్నాయని కొందరి అభిప్రాయం.

డా॥ నాగభైరవ అవార్డు కమిటి
నెల్లూరు
ఆహ్వానం




సుప్రసిద్ధ సాహితీవేత్త
డా॥ నాగభైరవ కోటేశ్వరరావు గారి స్మారక
7వ అవార్డు పండుగ

15.11.2015, ఆదివారం 6-05 గం॥లకు టౌన్‌హాలు, నెల్లూరు.

పురస్కార గ్రహీత :
శ్రీ గొల్లపూడి మారుతీరావు
ప్రముఖ సినీ రచయిత, నటులు
సభాధ్యక్షులు :
శ్రీ వెన్నెలకంటి
ప్రముఖ సినీకవి
జ్యోతి ప్రకాశనం :
శ్రీ తుంగా శివప్రభాత్‌రెడ్డి
సంగ్రాహకులు, 'లాయర్' వారపత్రిక

ప్రధాన అతిథి :
శ్రీ గజరావు భూపాల్ IPS
సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, నెల్లూరు
విశిష్ట అతిథులు :
శ్రీ బీద మస్తాన్‌రావు
సభ్యులు, రాజధాని నిర్మాణ కమిటీ
శ్రీ కోమిట్ల రెనిల్‌కుమార్‌రెడ్డి
అధినేత, కోమిట్ల గ్రూప్

ఆత్మీయ అతిథి :
శ్రీ వీరిశెట్టి హజరత్‌బాబు
యం.డి., మురళీకృష్ణ 70 సంస్థలు
గౌరవ అతిథులు :
శ్రీ నియోగి
ఆంధ్రప్రభ, హైదరాబాదు
శ్రీ నాగభైరవ వీరబాబు
సినీ దర్శకులు



పద్యకవితా పోటీల్లో విజేత శ్రీ ఉన్నం జ్యోతివాసు గారికి సత్కారం
నాగభైరవ స్ఫూర్తి అవార్డు గ్రహీతలు :
'గల్పిక' శ్రీను, నెల్లూరు, శ్రీ వేంపల్లి అబ్దుల్ ఖాదర్, కలికిరి, శ్రీ బోడావుల నాగేశ్వరరావు, ఇంకొల్లు, డా॥ వెన్నిచెట్టి సింగారావు, గుంటూరు, శ్రీ మోదుగుల రవికృష్ణ, గుంటూరు, శ్రీ చింతా అప్పలనాయుడు, శ్రీకాకుళం
కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి
'కళాంజలి' అనంత్
కన్వీనర్
డా॥ బీరం సుందరరావు
సమన్వయకర్త
చిన్ని నారాయణరావు
ప్రధాన కార్యదర్శి
సహకారం : శ్రీ దూళిపాళ్ల హనుమంతరావు, శ్రీ మన్నం నరసింహారావు, శ్రీ నాగభైరవ ఆదినారాయణ, శ్రీ కూకట్ల వెంకయ్య



# గూడూరు ప్రాంతంలో జానకమ్మ పర్యటన

నెల్లూరు, గూడూరు డివిజన్‌లలో తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి బుధవారం పరిశీలించారు. చిల్లకూరు మండలం పురిటిపాళెం, తిప్పగుంట గ్రామాల మధ్య నీటి ప్రవాహం వల్ల రాకపోకలు నిలిచిపోయిన రోడ్డును పరిశీలించి కృష్ణపట్నం నుండి రెండు బోట్లు తరలించి తిప్పగుంట గ్రామస్తులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా వెంగన్నపాళెం నుండి, కొలనకుదురు, బద్దెవోలు, కట్టువపల్లి గ్రామాలకు కూడా సంబంధాలు తెగిపోయాయని, ఆయా గ్రామస్తులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆమె ఆదేశించారు. మనుబోలు గ్రామంలో యస్‌టి కాలనీలో నిలిచిపోయిన నీటిని తొలగించి, కొత్తగా రోడ్డు వేయాలని కాలనీవాసులు కలెక్టర్‌ను కోరారు. తుఫానువల్ల రొయ్యల చెరువులు కొట్టుకుపోయాయని, తమను ఆదుకోవాలని అక్కడి రైతులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం కలెక్టర్ పంబలూరు, తెల్లకాలువను పరిశీలించారు. పంబలూరు వాగుపై వంతెన నిర్మాణానికి 13కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆర్ అండ్ బి అధికారులు కలెక్టర్‌కు వివరించగా తక్షణమే ప్రభుత్వానికి లేఖ వ్రాసి మంజూరుకు ప్రయత్నిస్తామని కలెక్టర్ తెలిపారు. తర్వాత కలెక్టర్ బాలాయపల్లి మండలం నిండలి గ్రామం వద్ద పొంగి పొర్లుతున్న కైవల్యానదిని, వెంకటగిరి వీవర్స్‌కాలనీలో నిలిచివున్న నీటిని పరిశీలించి తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టర్ వెంట గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషా, నెల్లూరు ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి, పంచాయితీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే మంచి మార్గం



విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తమ భవిష్యత్తుకు పూలబాట వేసుకోవాలని అదనపు సంయుక్త కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ అన్నారు. ఆయన 7వతేదీ నెల్లూరు, డికెడబ్ల్యు కళాశాల ఆవరణలో జరిగిన నెల్లూరు డివిజన్‌స్థాయి యువజన ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎటువంటి ర్యాగింగ్ జరగకుండా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ఆప్యాయతతో ఆదరించాలని కోరారు. ర్యాగింగ్ చట్టం చాలా కఠినమైందని, కాబట్టి విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా కళాశాలలో జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. క్రమశిక్షణ ఉండినవాడే అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. మారుమూల ప్రాంతాల నుండి విద్యార్థిని విద్యార్థులు ఈ ఉత్సవాలలో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు.

యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ సి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో జనవరి 12వ తేదీ నుండి 16వ తేదీ వరకు జాతీయ యువజనోత్సవాలు జరుగుతాయన్నారు. 2016వ సంవత్సర జాతీయ యువజనోత్సవాలు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరుగనున్నాయన్నారు.

ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ మాట్లాడుతూ గత సంవత్సర జాతీయ స్థాయి యువజన ఉత్సవాలలో నెల్లూరుజిల్లా రెండవ స్థానాన్ని సాధించిందన్నారు. ఈ సంవత్సరం కూడా మంచి ఫలితాలు రావాలని కోరారు.

డికెడబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి శైలజ మాట్లాడుతూ తమ కళాశాలలో డివిజన్ స్థాయి యువజనోత్సవాలు జరుపుకోవడానికి అవకాశం ఇచ్చిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేరుస్తున్న బాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా పరిశీలకులు కొల్ల నరశింహయాదవ్ అన్నారు. సోమవారం టిడిపి నగరాధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు ఆర్ఆర్ వీధిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద డెంగీ విషజ్వరాలపై అవగాహన సదస్సుతో పాటు ఆయుర్వేద వైద్యులు శ్రీనివాసరావు సహకారంతో ఆయుర్వేద మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు రెండువేల మందికిపైగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరశింహయాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు ఎంతో శ్రమించి నవ్యాంధ్రకు కావాల్సిన హంగులు సమకూరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మవరపు సుబ్బారావు, కిలారి వెంకటస్వామి నాయుడు, కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## ఆదిశంకర 'ఐబిఎం' ఉద్యోగ విజయోత్సవం

గూడూరు సమీపాన వున్న ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ 'ఆదిశంకర ఐబిఎం ఉద్యోగ విజయోత్సవం-2015' సభను కళాశాల ఛైర్మెన్ వంకి పెంచలయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జానకి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత స్థితిలో చూడాలని తపిస్తారని, అలాగే ఉపాధ్యాయులు దాన్ని ఆచరణలో పెట్టేందుకు సర్వశక్తులతో శ్రమిస్తారన్నారు. వారి లక్ష్యాలను వమ్ము చేయకుండా యువత దిశ దశ మార్చే శక్తిగా ఎదగాలని కోరారు. ప్రసిద్ధ ఐబిఎం సంస్థలో 122మంది ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ఆదిశంకర టాలెంట్ టెస్ట్ ద్వారా చదివి ప్రస్తుతం ఐబిఎంకు ఎంపికైన శ్రీలక్ష్మి అనే విద్యార్థిని కలెక్టర్ ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్పీ గజరావుభూపాల్ ఐబిఎంకు ఎంపికైన విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ విద్యాభివృద్ధి మహిళ చదువుతోనే సాధ్యమని చెప్పారు. విద్యార్థులు విద్యార్థినుల పట్ల గౌరవభావంతో ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌పై కళాశాల యాజమాన్యం దృష్టి సారించి విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణకుమార్, ఏవో రామయ్య, శ్రీకాంత్ కోడాలి, రాజారెడ్డి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు చట్టాలపై అవగాహన కలిగివుండాలి

### - జడ్జి గుర్రప్ప



చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగివుండాలని గూడూరు న్యాయసేవా సంస్థ ఛైర్మెన్, ఏడో అదనపు జిల్లా జడ్జి గుర్రప్ప తెలిపారు. పట్టణంలోని రాజావీధి ప్రాంతంలో వున్న సునీతా సేవా సంస్థ కార్యాలయంలో సోమవారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గుర్రప్ప మాట్లాడుతూ చట్టాలు పట్ల ప్రజలు పరిజ్ఞానం కలిగి వుండి హక్కులు విధులను తెలుసుకోవాలని సూచించారు. చిన్నచిన్న సివిల్‌కి సంబంధించిన విషయాలను స్టేషన్‌కు వెళ్లకుండా న్యాయసేవా సంస్థ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఏడుకొండలు మాట్లాడుతూ నేటి సమాజంలో విడాకుల కేసులు అధికమయ్యాయని భార్యాభర్తల మధ్య సహనం, ఓర్పు నేర్పు అవసరమని సూచించారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి, లీలా తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లు పాసుపుస్తకాల్లో నమోదు చేస్తాం

### - కందలిలో 'మీ ఇంటికి మీ భూమి'లో కలెక్టర్



జిల్లా వ్యాప్తంగా ఉన్న లక్ష ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను అనుభవంలో వున్న కుటుంబాలకు పట్టాలు ఇచ్చేలా ప్రతిపాదనలు ఉన్నాయని, అలాగే రిజిస్ట్రేషన్లు వ్రాతపూర్వకంగా వున్నవి కూడా త్వరలోనే పాసుపుస్తకాల్లో నమోదు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పాలనాధికారిణి జానకి తెలిపారు. గూడూరు మండలం కందలి, చెమిర్తి గ్రామాల్లో ఈ నెల 7వ తేదీ 'మీ ఇంటికి మీ భూమి' కార్యక్రమాన్ని తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మ నిర్వహించారు. తొలుత కందలిలో పాల్గొన్న కలెక్టర్ మొదటి విడతలో వచ్చిన వినతుల కంటే ప్రస్తుతం అధికంగా రావడం ఏంటని, పల్లెల్లో ప్రచార లోపమని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విఆర్వోను గ్రామంలో భూమి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాత్రం దశాబ్దాల తరబడి సీజేఎఫ్ఎస్ భూములను, ఇతర పోరంబోకు భూములను సాగు చేస్తున్నామని, తమకు ఎలాంటి ఋణ సౌకర్యం కల్పించలేదన్నారు. ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను భూస్వాములు దౌర్జన్యంగా ఆక్రమించడంతో జీవనం లేకుండా పోతుందని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమగ్రంగా విచారించి తిరిగి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేలా తహశీల్దార్ వెంకట నారాయణమ్మను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ గిరీషా, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ సుధాకర్, వైద్యులు సునీల్, తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మ, ఎంపిడివో భవాని, సర్పంచి రమణమ్మ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జోత్స్నలత, బొల్లినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ధరలు తగ్గించాలని వామపక్షాల ధర్నా

పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని వామపక్ష నాయకులు గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పట్టణంలోని సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాల వల్ల ఆకాశానికి నిత్యావసర పప్పులు ధరలు తాకాయని, తక్షణం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు యాదగిరి, కేశవులు, సివిఆర్ కుమార్, వివి రమణయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి రోడ్డులో ఆక్రమణల తొలగింపు

గూడూరు పట్టణంలోని ఆసుపత్రిరోడ్డులో ఆక్రమణలపై పురపాలక అధికారులు ఆదివారం ఆ ప్రాంతంలో రోడ్డు వెంబడి వున్న దుకాణాలను తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ తొలుత స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ మోదకొండ, పట్టణ సిఐ సుబ్బారావు కోరారు. వారం రోజుల క్రితం గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో తనిఖీ నిర్వహించిన గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషా ఆసుపత్రిరోడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాలన్నీ తొలగించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం తొలగింపు చేపట్టారు. భారీగా పోలీసులు, పురపాలక సిబ్బంది చేరుకుని తొలుత మార్కెట్ సెంటర్ ప్రాంతం నుంచి తొలిగించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో చిరు వ్యాపారులు ఖాళీ చేయడానికి కొంత గడువు కోరారు. ఓ దశలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనికి అధికారులు ఒప్పుకోక పోవడంతో వెంటనే తొలగింపు చేపట్టారు. ఆసుపత్రి రోడ్డులో ఆసుపత్రి వైపు వున్న అన్నింటిని తీయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బాబీ, గోపాల్ పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

గల్పిక

# నెల్లూరు కార్పొరేటర్లకు చెన్నైలో సన్మానం

అది చెన్నైలోని ఆంధ్రా క్లబ్ ఆడిటోరియం. అక్కడ వేదిక మీద "నెల్లూరు నగరపాలక వర్గ సభ్యులకు సన్మానం" అని వ్రాసిన ఫ్లెక్సీని బ్యాక్‌డ్రాప్‌లో కట్టున్నారు. దాని క్రింద చెన్నై హాస్పిటల్స్ యాజమాన్యాల అసోసియేషన్ అని కూడా వ్రాసుంది. అప్పుడే ముఖ్యమంత్రి జయలలిత, తమిళనాడు తెలుగు సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ సిఎంకె రెడ్డి, అపోలో ఆసుపత్రి ఛైర్మెన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి, ఇంకా విజయ ఆసుపత్రి, గ్లోబల్ ఆసుపత్రుల నుండి పలువురు వైద్యులు వచ్చి వేదికపై కూర్చున్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిఎంకెరెడ్డి మాట్లాడుతూ ఈరోజు చెన్నైలోని ఆసుపత్రులు రోగులతో నిండుగా వుంటూ ఆర్థికంగా బాగున్నాయంటే అది నెల్లూరు నగరపాలకుల పుణ్యమే. ఒకరకంగా చెప్పాలంటే చెన్నైలోని ఆసుపత్రులన్నింటికి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఒక ఆథరైజ్డ్ ఏజన్సీ అనుకోవచ్చు. మీ వల్లే అక్కడ ముదురుదోమలు పెరగడం, విషజ్వరాలు రావడం, అక్కడి జనాలు ఇక్కడి ఆసుపత్రులలో చేరడం... లక్షల రూపాయలు ఆసుపత్రులకు కట్టడం... మీవల్ల పన్నుల రూపంలో తమిళనాడు ప్రభుత్వానికి కూడా ఆదాయమే. కాబట్టి జయలలిత చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించాలనుకున్నామని చెప్పాడు. ఆ తర్వాత మేయర్ అజీజ్, డిప్యూటీ మేయర్ ఎం.ద్వారకానాథ్‌లతో పాటు కమిషనర్ పివిఎస్ మూర్తిని, మిగతా 52మంది కార్పొరేటర్లను జయలలితతో పాటు కార్పొరేట్ ఆసుపత్రుల వాళ్లు కూడా ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమం ముగిసాక జయలలిత మాట్లాడుతూ చెన్నైలో ఆసుపత్రులు లాభాల్లో నడవడానికి మీరందిస్తున్న సహకారానికి నా అభినందనలు, ముమ్ముందు కూడా ఈ సహకారం ఇలాగే వుండాలి, పోతే గతంలో మీ నగరపాలక సంస్థకు ఒక కీర్తి, ఒక గుర్తింపు వుండేది. నెల్లూరు కౌన్సిల్ సమావేశం అంటే కార్పొరేటర్లు హాలీవుడ్ సినిమాల్లో మాదిరిగా తన్నుకునే వాళ్లు. నలుగురైదుగురు తలలు పగిలేవి, ఒకరిద్దరికి చేతులిరిగేవి, ఈ సంగతులు నాకెలా తెలుసంటే వాళ్లొచ్చేది చెన్నై ఆసుపత్రులకే కదా! మీ కౌన్సిల్ సమావేశాలలో ఫైట్ సీన్‌లను చూసే మా ఎమ్మెల్యేలు కూడా స్ఫూర్తి పొందేవాళ్లు. అసెంబ్లీలో మీ మాదిరిగానే తన్నుకునే వాళ్లు. కాని ఈమధ్య కాలంలో మీ కౌన్సిల్ సమావేశాలు చప్పగా ఉంటున్నాయి. మీలో ఆ ఫైర్ లేనట్లుంది. ఆవేశం లేనట్లుంది. మీలో ఆశక్తి లేనట్లుంది. ఇప్పుడు మీ కౌన్సిల్ సమావేశాలు చూస్తుంటే ఉత్సాహంగా వుండేవాళ్లకు కూడా నీరసమొస్తుందని చెప్పింది. ఆమె మాటలతో మేయర్ అజీజ్ ముఖం చిన్నబోయింది. కొంచెం అవమానంగా అనిపించిందాయనకు!

★★★★★

ఐఆర్ 20-420 ముదురుదోమల ఉత్పత్తి కేంద్రమైన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు. మేయర్ అజీజ్ తన ఛాంబర్‌లో దిగులుగా కూర్చునివున్నాడు. అప్పుడే లోపలకు డిప్యూటీ మేయర్ ఎం.ద్వారకానాథ్, కార్పొరేటర్లు డాక్టర్ జడ్.శివప్రసాద్, పి.రూప్ కుమార్‌యాదవ్, బొబ్బల శ్రీనివాసులు, ప్రశాంతి కుమార్, దాసరి రాజేష్‌లు వచ్చారు. ఎందుకలా వున్నావని అజీజ్‌ను జడ్.యస్. అడిగాడు. అప్పుడు అజీజ్... నిన్న మీరే విన్నారు కదా సార్, జయలలిత అన్న మాటలు, మనలో అంత సత్తువలేదా? గత కార్పొరేటర్ల కంటే మనం తీసిపోయామా? మనం ఆ మాత్రం తన్నుకోలేమా? ఎందుకు మనకు ఈ అప్రతిష్ట అని అన్నాడు. దానికి రూప్‌కుమార్‌యాదవ్... మేయర్ గారూ, ఇక్కడ ప్రధాన సమస్య ఏంటంటే మేం ఒకరిద్దరం తప్పితే ఈ కౌన్సిల్‌లో అందరూ కొత్తోళ్లే! వాళ్లకు నెల్లూరు నగరపాలక సంస్థ సంప్రదాయాలు, పేరు ప్రతిష్టలు తెలియడం లేదు. కౌన్సిల్ సమావేశమంటే వచ్చి భోంచేసుకుని పోవడం అనుకుంటున్నారు. ఒకసారి కౌన్సిల్ సమావేశం జరిగిందంటే నెలరోజులు దానిని మరచిపోకుండా వుండాలి. తలలు పగలడం, కాళ్లు విరగడం కామన్‌గా వుండాలి. మీడియా అంతా కౌన్సిల్ హాల్ వద్ద మూగిపోవాలి. కాని ఇప్పుడు అలా కాదు. జయలలిత అన్నట్లు మనవాళ్లలో ఆ ఫైర్ లేదు అని అన్నాడు. నేనొక పనిచేద్దామనుకుంటున్నాను రూప్‌కుమార్, జపాన్ నుండి మంచి కరాటే మాస్టర్‌ను పిలిపిస్తాను, ప్రతిరోజూ ఉదయం 7 నుండి 8 గంటల దాకా కరాటే క్లాసు... అందరం అటెండ్ కావాలి, బాగా కరాటే నేర్చుకుని కౌన్సిల్ హాల్‌లో తన్నుకుందాం, అప్పుడు మన కౌన్సిల్‌కు పూర్వవైభవం వస్తుందని అజీజ్ ప్రతిపాదించాడు. అందుకు జడ్.యస్ నవ్వి... అజీజ్ నాకు కౌన్సిల్‌లో అనుభవం లేకపోయినా గత కౌన్సిల్ సమావేశాలు చూసిన అనుభవంతో చెబుతున్నా, జపాన్, చైనాల నుండి కరాటే మాస్టర్‌లు వచ్చి శిక్షణ ఇచ్చినంత మాత్రాన లాభం లేదు. మనలో ఫైర్ లేనప్పుడు వాళ్లు శిక్షణ ఇచ్చి ఏం లాభం, గతంలో వివేకా, అనూరాధ, పులిమి శైలజ, భానుశ్రీల హయాంలో కొట్టుకున్న కార్పొరేటర్లందరూ కూడా కరాటే శిక్షణ తీసుకున్నోళ్లు కాదు, కొట్టుకోవాలంటే ఇంట్లోనే కాదు ఒంట్లో కూడా కరెంట్ ఉండాలి, ఈ విషయంలో మనం ఎంతో అనుభవజ్ఞుడైన స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64+)ను కలిస్తే మంచిదన్నాడు. మిగతా వాళ్లు కూడా దానికి సరేనన్నారు.

★★★★★

కాపువీధిలోని వివేకా నివాసం. 'ఓ అప్పారావు... ఓ సుబ్బారావు... ఓ వెంకట్రావు... ఓ రంగారావు... ఎవరో ఎవరో వస్తారనుకుంటే నువ్వొచ్చావా...' అనే బొబ్బిలిపులి సినిమాలోని పాట రింగ్‌టోన్‌తో ఆయన సెల్‌ఫోన్ మోగింది. వివేకా నిద్రలేచి ఆ ఫోన్ మాట్లాడి హాల్‌లోకి వచ్చాడు. అక్కడ అజీజ్, ద్వారకానాథ్, జడ్.యస్, రూప్ కుమార్, బొబ్బల శ్రీనివాసులు ఇంకా కొంతమంది కార్పొరేటర్లున్నారు. ఏం ఇలా వచ్చారని వివేకా అడిగాడు. అజీజ్ సమస్యను చెప్పాడు. గతంలోలాగా మా కార్పొరేటర్లలోనూ ఆవేశం, పౌరుషం రావాలి. కౌన్సిల్ సమావేశాలలో ఒకర్నొకరు తన్నుకోవాలి, నెల్లూరు కౌన్సిల్ పేరు నిలబెట్టాలి. దీనికి ఏం చేయాలో మీరే చెప్పండని అడిగాడు. వెంటనే వివేకా సెల్ తీసి పిండి సురేష్, చాట్ల నరసింహారావు, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, మేకల నరేంద్ర, ఊటుకూరు లక్ష్మయ్య, ధర్మవరం సుబ్బారావు, శిరిగిర చక్రవర్తిలకు ఫోన్ చేసి అప్పటికప్పుడు పిలిపించుకున్నాడు. వివేకా మీద అభిమానంతో అందరూ పది నిముషాలలో అక్కడ పోగయ్యారు. వివేకా వారితో... నెల్లూరు నగరపాలక సంస్థ కీర్తిప్రతిష్టలను నిలబెట్టే బాధ్యతను మీ భుజాల మీద పెడుతున్నాను, నెల్లూరు కౌన్సిల్‌కు గతంలో వున్న పేరు రావాలి, కొత్తవాళ్లకు ఎలా ట్రైనింగ్ ఇస్తారో, ఏం చేస్తారో నాకు తెలియదు, ఈసారి జరిగే రెండో కౌన్సిల్ సమావేశానికల్లా అక్కడ రక్తపాతం జరగాలి. మీ ఇష్టం అన్నాడు. దానికి పిండి సురేష్‌తో పాటు సీనియర్‌లంతా... రెండో కౌన్సిల్ మీటింగ్ దాకా ఎందుకు బాస్... రేపు మీటింగ్‌లోనే వాళ్లను అరివీరభయంకరంగా తన్నుకునేటట్లు శిక్షణ ఇస్తాం... మీ మాట నిలబెడతాం, మీ శిష్యులమనిపించుకుంటాం అని ప్రామిస్ చేసి లేచారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 13.11.2015 నుండి
తేది. 19.11.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో కుజ రాహుశుక్రులు, తులలో రవిబుధులు, 16తేది నుండి వృశ్చికంలో రవి, 17 తేది నుండి వృశ్చికంలో బుధుడు, వృశ్చికంలో శని, వృశ్చిక ధనుర్మకరాలలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 14 శనివారము బాలల దినోత్సవము. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి.
తేది 15 ఆదివారము నాగుల చవితి

### ముహూర్తములు

తేది 18 బుధవారము ఉదయము గంట 9.0 నుండి గంట 10.53 వరకు ధనుర్లగ్నమున గృహారంభ, వివాహ వ్యాపారములు.

తేది 16 సోమవారము రాత్రి 12.0 నుండి 2.0లోగా సింహ లగ్నమున గృహప్రవేశము.

### కార్తీక మాస శుక్లపక్షతిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | విదియ | రా॥ గం.12.11వ॥ |
| తేది. 14 | శని | తదియ | రా॥ గం.12.48వ॥ |
| తేది. 15 | ఆది | చతుర్థి | రా॥ గం.12.59వ॥ |
| తేది. 16 | సోమ | పంచమి | రా॥ గం.12.07వ॥ |
| తేది. 17 | మంగళ | షష్ఠి | రా॥ గం.11.00వ॥ |
| తేది. 18 | బుధ | సప్తమి | రా॥ గం.9.34వ॥ |
| తేది. 19 | గురు | అష్టమి | రా॥ గం.7.44వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఖర్చులు పెరుగుతాయి. కాబట్టి ఖర్చులపై అదుపు అవసరం. వృత్తి జీవనం కలవారికి ఆదాయం సంతృప్తికరం. వ్యాపార వర్గాలకు అవకాశాలు తప్పి పోవడం, ఆదాయం తగ్గడం ఉంటుంది. నిర్వహించే వ్యవహారాలను జాగ్రత్తగా నెరపండి. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడతాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి జీవనం కల వారికి రాబడి బాగుంటుంది. వ్యాపారవర్గాలకు అభివృద్ధి, ఆదాయం తృప్తికరం. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. వ్యవహారాలలో మీ ఆధిపత్యం సాగుతుంది. ఉద్యోగులకు పదోన్నతులు, స్థానమార్పులు, మంచి పలుకుబడి ఉంటుంది. షేర్లు, పెట్టుబడి రంగాలలో లాభాలుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులకు కొద్ది ఆటంకాలు ఎదురై మరల సాగుతుంటాయి. శుభకార్య నిర్వహణలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. వ్యాపారవర్గాలకు ఆశించినంత రాబడి, వృద్ధి వుండదు. వృత్తుల జీవనం గల వారికి ఆర్థిక స్థితి కొంత మేలుగా వుంటుంది. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసికొనండి. బిల్డర్లకు, కాంట్రాక్టర్లకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారవృద్ధికై చేసే ప్రయత్నాలు సత్ఫలితాలనిచ్చి ఆదాయం పెరుగుతుంది. ఇతరులకు మాట సహాయం, ధన సహాయం చేస్తారు. అవసరాలకు అనుకూలతతో డబ్బు సమకూరుతుంది. అనుకున్న పనులు సమర్థతతో నిర్వహిస్తారు. సంఘాలు సమావేశాలలో మీ సలహాలు ఆమోదయోగ్యం కాగలవు. కాంట్రాక్టర్లు, వ్యాపారులకు అగ్రిమెంట్లు, కొత్త పనులు లభిస్తాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆంతరంగిక వ్యవహారాలు బయటకు రాకుండా జాగ్రత్త వహించండి. బిల్లులు చెల్లింపులు సకాలంలో జరుపుతారు. చేపట్టిన పనులు సానుకూలం కాగలవు. ఆర్థిక ఇబ్బందులు పరిష్కారం కాగలవు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. చిన్న పరిశ్రమలు చిన్న వ్యాపారులకు మంచి అభివృద్ధి ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నం అనుకూలిస్తుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి జీవనం కలవారికి, చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమల వారికి ఆర్థికంగా బాగుంటుంది. హోల్‌సేల్ వ్యాపారులు, స్టాకిస్టులకు ప్రభుత్వ వర్గాల నుండి ఇబ్బందులుంటాయి. ఖర్చులు అదనంగా పెరుగుతాయి. ఋణాలు చేయవలసి రావచ్చును. ప్రముఖులతో, పెద్దలతో పరిచయ వ్యాపకాలు పెరుగుతాయి. పెట్టుబడి రంగాలలో అవకాశాలు నిదానం కాగలవు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వస్తు వాహన రిపేర్ల ఖర్చులు, శుభకార్యాల ఖర్చులు ఎక్కువకాగలవు. వృత్తి జీవనం కలవారికి మంచి ఆర్థిక స్థితి. వ్యాపారవర్గాలకు సామాన్య ఆదాయ ముంటుంది. కుటుంబంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాగలవు. పెట్టుబడుల విషయంలో తొందరపడవద్దు. కుటుంబ బంధువులతో సమస్యలు రాకుండా చూచుకొనాలి. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి పనివత్తిడి పెరుగుతుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధుమిత్రులతో సంబంధాలు బలపడతాయి. వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపార వర్గాలకు ఆదాయం పరిస్థితి ప్రస్తుతం సామాన్యంగా ఉంటుంది. అయితే శుభకార్య ఖర్చులు, ఇంటి ఖర్చులు ప్రయాణ ఖర్చులు కొద్ది ఎక్కువ కాగలవు. తొందరపడి అతిగా నమ్మకాలు పెంచుకొనవద్దు. రావలసిన బాకీలు కొంతవరకు అందగలవు.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపారాలు బలపడి ఆదాయం పెరుగుతుంది. కొత్త ఆర్థిక ఒప్పందాలు, వ్యాపార ప్రారంభాలు జరుగుతాయి. వృత్తి పరంగా అభివృద్ధి ఉంటుంది. ఇంట బయట పనుల వత్తిడి వల్ల శ్రమగా ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించగలరు. అధికారులకు స్థానమార్పులు, అదనపు పర్యవేక్షణ బాధ్యతలుంటాయి. బిడ్డల విద్యావృద్ధి, శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికంగా మంచి అభివృద్ధి కనుపించగలదు. ఆదాయం పెరుగుతుంది. టెన్షన్ తగ్గి స్థిమితపడతారు. కొత్త పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. నిర్మాణాలు, కొత్త వ్యాపారాల ప్రారంభం జరుగుతుంది. అధికారులకు బాధ్యతలు పెరగడం, స్థానమార్పులుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలు, శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చేసే పనుల్లో పొరపాట్లు జరుగకుండా చూచుకొనండి. వాహనాలు నడిపేవారు యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా మెలగండి. గృహ నిర్మాణాలు మార్పులు చేర్పులుంటాయి. వస్తు వాహన రిపేర్లుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు అందుతాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికంగా ఇబ్బందులుండినా, అవసరాలకు డబ్బు అందుతుంది. వృత్తి పరంగా లాభసాటిగా ఉంటుంది. వ్యాపారులకు అధికారుల, ప్రభుత్వం యొక్క బెడద ఉంటుంది. అయినా వ్యాపార వర్గాలకు ఆదాయం సామాన్యం. బంధుమిత్రుల సహకారంతో ఒక ముఖ్యపని నెరవేరుతుంది. పెట్టుబడులందు, షేర్ల యందు అంతగా సంతృప్తి ఉండదు. రావలసిన బాకీలు అందుతాయి.



## కావలి కబుర్లు

# సామాన్యులకు దూరమవుతున్న విద్య

**- పిడిఎస్‌ఓ జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్**




నేడు పాలకులు విద్యా రంగాన్ని ప్రైవేటు పరం చేసి సమాజంలోని సామాన్యులకు విద్యను దూరం చేస్తున్నారని పిడిఎస్‌ఓ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ రీడింగ్ రూమ్ ఆవరణంలో పిడిఎస్‌ఓ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ, సాంస్కృతిక, ప్రజాతంత్ర, విద్యా విధానం సాధనే లక్ష్యంగా అందరికీ విద్య, ఉపాధి, వైద్యం హక్కుల సాధనకై పిడిఎస్‌ఓ ఉద్యమిస్తుందని అన్నారు. సాంకేతిక విద్య ప్రజల అవసరాలను తీర్చేదిగా కాకుండా కేవలం కార్పొరేట్ అవసరాలను తీర్చే విధంగా తయారైందన్నారు. విద్యార్థుల్లో అలజడి మొదలైందని, అందులో భాగంగానే ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా కుల నిర్మూలన జరగాలన్నారు. వీటితో పాటు మొదలగు అంశాలపై ఈ నెల 13, 14, 15 తేదీలలో జరిగే పిడిఎస్‌ఓ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ అంశాలను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, ఆంధ్ర యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎన్.నిర్మల, కాకతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి, సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, మాజీ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌బాబు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిడిఎస్‌ఓ సభ్యులు వరప్రసాద్, నాయకులు, ప్రసన్నకుమార్, మణికుమార్, మధు, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్‌ల సొమ్ము స్వాహా

- పింఛన్ల పంపిణీలోనూ అక్రమాలు
- సామాజిక తనిఖీతో వెలుగులోకి




ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం మండలంలో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, వృద్ధుల పింఛన్లు అనర్హుల పేర్లతో సొమ్మును డ్రాచేసి స్వాహా చేసిన వెలుగు, గ్రామాల సంఘబంధం సభ్యుల భాగోతం సామాజిక తనిఖీలో వెలుగులోకి వచ్చింది. సోమవారం రాత్రి కొండాపురం ఎంపిడిఓ కార్యాలయంలో 2014-15 సంవత్సరంలో ఇచ్చిన స్కాలర్‌షిప్‌లపై జిల్లా డిపి ఎంఇ మురళీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాహా పర్వం వెలుగులోకి వచ్చింది. మండలంలో సుమారు 813మంది విద్యార్థులకు అభయహస్తం, ఆమ్‌ఆద్మీ పథకం ద్వారా పదవ తరగతి, ఇంటర్ చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాల్సి వుండగా వెలుగు కార్యాలయ కోఆర్డినేటర్లు, గ్రామాల్లోని సంఘబంధం సభ్యులు కలిసి చేతివాటం ప్రదర్శించారు. అసలు గ్రామాల్లో రేషన్‌కార్డుల్లో పేర్లు లేని విద్యార్థుల పేర్లను జాబితాలో చేర్చి సుమారు రూ.1,56,600 నగదు డ్రా చేసినట్లు వెల్లడైంది. కొమ్మి గ్రామంలో ఒకే విద్యార్థి పేరుతో రెండుసార్లు ఎంటర్ చేసి నగదు డ్రా చేశారు. అదే గ్రామంలో 6మంది అనర్హులైన విద్యార్థుల పేర్లు నమోదు చేసి నగదు డ్రా చేసినట్లు ఆయన వెల్లడించారు.


ఇదే తరహాలో పింఛన్ల పంపిణీ వ్యవహారంలోనూ కొంత మంది విఆర్‌ఓలు, కార్యదర్శులు, పిబిఎంలు అక్రమానికి పాల్పడినట్లు తనిఖీలో వెల్లడైనట్లు అధికారి చంద్రశేఖర్ తెలిపారు. సుమారు 381పింఛన్లపై విచారణ జరపగా పలు రకాలుగా అవినీతి జరిగినట్లు తెలిపారు. తనిఖీలు చేసేకొద్దీ అవినీతి బయట పడుతుండటంతో అధికారులు తదుపరి చర్యలు చేపట్టేందుకు సమాయత్తమవుతున్నారు.

# మైనార్టీల భద్రత, సంక్షేమం టిడిపికి రెండు కళ్ళు



రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీకి మైనార్టీల భద్రత, సంక్షేమం రెండు కళ్ళులాంటివని, మైనార్టీల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్ కీర్మాణి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మైనారిటీ విభాగం నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలులో ఉర్దూ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయడం చాలా ఆనంద దాయకమన్నారు. దీని ద్వారా మైనార్టీలకు 2 లాభాలు ఉన్నాయన్నారు. మొదటిది ఉర్దూ భాషపై మంచి ప్రావీణ్యం కలుగుతుందని, రెండవది ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దస్తగిరి, పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఎస్.కె.కరీముల్లా, టిడిపి సీనియర్ నాయకులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# కవులకు కీర్తి కిరీటం
# డాక్టర్ నాగభైరవ కవితా పురస్కారం



*సుప్రసిద్ధ కవి, సాహితీవేత్త, వేలాది మంది శిష్యులను తీర్చిదిద్దిన ఉత్తమ అధ్యాపకులు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట ప్రతియేటా ఇస్తున్న నాగభైరవ కవితాపురస్కారం కవులకు, రచయితలకు కీర్తి కిరీటంగా భాసిల్లుతోంది. ప్రతిష్ఠాకరమైన ఈ పురస్కారం అందుకోవడాన్ని కవులు, రచయితలు గర్వంగా భావిస్తున్నారు. కవులు, రచయితలు, సాహితీవేత్తలను సత్కరించేందుకు, కృషిని గుర్తించి గౌరవించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంస్థలు, ప్రభుత్వం ఇస్తున్న అవార్డులు, పురస్కారాలున్నప్పటికీ, 'నాగభైరవ స్మారక కవితా పురస్కారానికి' ఒక ప్రత్యేకమైన గుర్తింపు లభించింది.*

నాగభైరవ గారు నెల్లూరులో యువకవుల్ని, రచయితల్ని భుజం తట్టి ప్రోత్సహించారు. రచనలు చేయించారు. పుస్తకాలు ప్రచురింపజేశారు. 'చేతన' అనే సాహిత్య సంస్థను నెలకొల్పారు. ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. డా॥ బెజవాడ గోపాలరెడ్డి, డా॥ తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి(పఠాభి), ఆరుద్ర, మరుపూరి కోదండరామిరెడ్డి, ప్రముఖుల సాన్నిహిత్యం పెన్నాతీరంలో కవితా వికాసానికి ఎంతో దోహదపడింది.

నాగభైరవ గారి నవ్యమైన ఆలోచన నుండి ప్రభవించిందే "కనన విజయం" సాహితీ రూపకం. 'కవితా చేతన' పేరుతో తొలి ప్రదర్శన నెల్లూరు పురమందిరంలో జరిగింది. ఆరుద్రతో పాటు పలువురు సాహితీ వేత్తలు, కవులు నాగభైరవ గారి సృజనాత్మకతను ప్రశంసించారు. అనంతరం ఆరుద్ర 'కవన విజయం'గా నామకరణం చేశారు. అప్పటి నుండి ఆంధ్రదేశంలోని పట్టణాల్లో, పల్లెల్లో, ఆంధ్రేతర ప్రాంతాల్లో, ఢిల్లీ, బొంబాయి, బెంగుళూరు, మద్రాసు, హైదరాబాద్ వంటి మహానగరాల్లో 480పైగా ప్రదర్శనలు పొంది, ప్రశంసలందుకున్న అపురూప సాహితీ రూపకం 'కవన విజయం'. 'కవన విజయం' నాగభైరవ కీర్తికిరీటంలో కలికితు రాయిగా నిలిచింది. నాగభైరవ గారు కాలం వెంట నడిచిన కవి. సీనియర్ కవులకు జేకొట్టడం, జూనియర్ కవులను భుజం తట్టడం నాగభైరవ గారి విశిష్ట వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వమే వారి ప్రగతికి బాటలు వేసింది. ప్రతిభను పరిమళింపజేసింది. యన్‌టి రామారావు వంటి మహానటుని సరసకు వెళ్లింది. 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' సినిమాకు మాటలు రాయించింది. ఎన్టీఆర్ చేత 'కవి గారు'గా సంభావింపజేసింది.

నాగభైరవ గారు ప్రతిష్ఠాకరమైన పురస్కారాలు అందుకున్నారు. అవార్డులు పొందారు. విద్య, సాహిత్య రంగాల్లో పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. సాహితీ రంగానికి వారు చేసిన కృషిని గుర్తించి పొ॥ శ్రీ॥ తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. డా॥ నాగభైరవ గారు 2008 జూన్ 14న అస్తమించారు.

నాగభైరవ స్మారకార్థం వారి ప్రియశిష్యులు, ప్రముఖ సినీ కవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ గారు మరో ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు గారు అధ్యక్ష, కార్యదర్శులుగా 'కళాంజలి' అనంత్ కన్వీనర్‌గా 2009లో 'నాగభైరవ అవార్డు కమిటీ' ఏర్పడింది. 'లాయర్' పత్రిక ఎడిటర్ తుంగా శివప్రభాత్‌రెడ్డి గారు, వీరిశెట్టి హజరత్‌బాబు గారు(మురళీకృష్ణ గ్రూపు సంస్థలు), మాజీ శాసనసభ్యులు బీద మస్తాన్ రావు గారు, ఉదయభాస్కర్ గారు(విమల్ జంక్షన్), ప్రభుత్వ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్, కవి రాచపాళెం రఘు గారు, వసంత స్పిన్నింగ్ మిల్స్(తిమ్మాపురం) యం.డి మన్నం నరసింహారావు గారు, రిటైర్డ్ డిప్యూటీ డిఇవో ధూళిపాళ హనుమంతరావు గారు, నాగభైరవ గారి ప్రియపుత్రులు, సినీ దర్శకులు, రచయిత వీరబాబు గారు, వారి కుటుంబసభ్యులు, మాదాల తిమ్మయ్య, శ్రీమతి కోకా విమలకుమారి వంటి దాతల సహకారంతో, సౌజన్యంతో గత 7సంవత్సరాలుగా నాగభైరవ కవితా పురస్కారాల ప్రదానోత్సవం నిర్విఘ్నంగా సాగుతోంది.

2009లో ప్రప్రథమంగా 'నాగభైరవ కవితా పురస్కారాన్ని' ప్రఖ్యాత సినీ నిర్మాత, సహజకవి మల్లెమాల(యం.యస్.రెడ్డి) గారు అందుకున్నారు. 2010లో ప్రముఖ కవి(వచన కవిత్వం) దర్భశయనం శ్రీనివాసాచార్య, 2011లో ప్రముఖ పద్యకవి, సినీ గేయరచయిత రసరాజు, 2012లో ప్రముఖ రచయిత, నటులు తనికెళ్ళ భరణి, 2013లో ప్రఖ్యాత కవి డా॥ అద్దేపల్లి రామమోహనరావు, 2014లో ప్రముఖ సినీ కవి డా॥ సుద్దాల అశోక్‌తేజలు అందుకోగా ఈ సంవత్సరం ప్రఖ్యాత రచయిత, సినీ నటులు గొల్లపూడి మారుతీరావు 'నాగభైరవ పురస్కారాన్ని' స్వీకరిస్తున్నారు.

యువకవుల్ని, రచయితలను ప్రోత్సహించాలనే ధ్యేయంతో 2013 నుండి 'నాగభైరవ స్ఫూర్తి పురస్కారం' ఏర్పాటు చేసి ప్రతియేటా ఐదుగురు కవులు, కవయిత్రులను 'అవార్డు'తో ఘనంగా సత్కరిస్తున్నారు. దీంతో పాటు గత సంవత్సరం(2014) నుండి వచన, పద్యకవిత్వం, విమర్శ, నాటక రచన, కథ వంటి ప్రక్రియలో రచనలను ఆహ్వానించి, ఎంపికైన రచయిత, కవికి నగదు పారితోషికం, శాలువ, జ్ఞాపికను అందజేస్తున్నారు. గత సంవత్సరం(2014) వచన కవిత్వంలో 'రావిజల' కవితా సంపుటికి డా॥ అద్దంకి శ్రీనివాస్, ఈ సంవత్సరం(2015) పద్యకవిత్వంలో 'ఆరాధన' పద్యకవితా సంపుటికి ఉన్నం జ్యోతి వాసు(ప్రకాశం జిల్లా) పురస్కారానికి ఎంపికయ్యారు.

నిత్య సాహిత్య చైతన్య మూర్తి, నిరంతర కవితా స్ఫూర్తి అయిన డా॥ నాగభైరవ కోటేశ్వరరావు గారి పేరిట ప్రతియేటా అవార్డు ప్రదానోత్సవం జరుగుతుందని, అందుకు సహకరిస్తున్న దాతలకు, సాహితీవేత్తలకు, నెల్లూరు పురజనులకు, మీడియా పత్రికల ద్వారా ప్రచారం కల్పిస్తున్న విలేకర్లకు అవార్డు కమిటీ కార్యదర్శి చిన్ని నారాయణరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 15న ఆదివారం సాయంత్రం నెల్లూరు టౌన్‌హాలులో జరిగే నాగభైరవ పురస్కార ప్రదానోత్సవానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



నాగభైరవ అవార్డు గ్రహీత - 2015
శ్రీ గొల్లపూడి మారుతీరావు

- డా॥ బిరం సుందరరావు
9848039080

# కూలిన చెట్లు... ప్రజలకు ఇక్కట్లు





నెల్లూరుజిల్లాలో చాలారోజుల తర్వాత కురిసిన వానతో నెల్లూరు నగరం అతలాకుతలమయింది. ఇటీవల కురిసిన వర్షాలతో రైతుల్లో ఆనందం నెలకొంది. అయితే ఎడతెరిపి లేకుండా కుండపోతగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్థంభించింది. దీపావళి పండుగ ముందు జోరుగా వర్షాలు రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. బాణాసంచా వ్యాపారం వర్షంతో తుస్‌మంది. నెల్లూరు నగరంతో పాటు దాదాపు 140గ్రామాల్లో అంధకారం అలముకుంది. విద్యుత్ స్థంభాలు పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో భారీవర్షానికి వరినారుమళ్లు నీట మునిగాయి. అయితే మెట్టప్రాంత పంటలకు జీవం పోసింది. జిల్లాలో సగం మండలాల్లో చెరువులు, కుంటలు నిండిపోవడంతో సేద్యానికి భరోసా ఏర్పడింది. ఉదయగిరి, కావలి ప్రాంతాల్లో వర్షాలు తక్కువగానే ఉన్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారి తీరాన్ని దాటడంతో సోమవారం నుంచి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం 4సెం.మీ సగటు వర్షం నమోదు కాగా సోమవారం సాయంత్రానికి 12 సెం.మీ సగటు వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రానికి జిల్లాలో 15 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వెంకటగిరిలో 24సెం.మీ, బాలాయపల్లిలో 23.6సెం.మీ వర్షం కురిసింది. గూడూరు డివిజన్‌లోను 20 సెం.మీ వర్షం నమోదైంది. ఆయా ప్రాంతాల్లోని కాళంగి, స్వర్ణముఖి, చల్లకాలువ, కైవల్యానదులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలాల్లో చెరువులకు భారీగా వరదనీరు చేరింది. జిల్లాలో 23మండలాల్లో తక్కువ వర్షం కురిసింది. 6మండలాల్లో అత్యధిక వర్షం కురవగా, 15మండలాల్లో సాధారణ వానలు కురిసాయి.

### నెల్లూరు నగరంలో సమస్యలు

ఇటీవల కురిసిన భారీవర్షాలకు నెల్లూరు నగరవాసుల జీవనం అస్తవ్యస్తమైంది. నగరం వరదనీటితో పోటెత్తింది. ఏ వీధి చూసినా రోడ్లపై వరదనీరు ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల పరిస్థితి దారుణంగా తయారైంది. రైల్వే అండర్ బ్రిడ్జిలు నీటితో నిండిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. బాలాజీనగర్, వనంతోపు, మాగుంట లేఅవుట్, భక్తవత్సలనగర్, మూలాపేట, రామ్మూర్తినగర్, హరనాథపురం, సంతపేట, చంద్రమౌళినగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి చేరిన నీటిని తోడుకుంటున్నారు. దీనికి తోడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు 350 విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు చెల్లాచెదురయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదాలు తప్పాయి. మంగళవారం మంత్రి నారాయణ, కలెక్టర్ యం.జానకి, కమిషనర్ మూర్తి, మేయర్ అజీజ్, ఇతర అధికారులు ఆయా ప్రాంతాలలో పర్యటించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

### బాణాసంచా వ్యాపారం వర్షార్పణం

జిల్లాలో మంగళవారం వరకు ఎడతెరిపి లేకుండా భారీగా కురిసిన వర్షాలతో దీపావళి బాణాసంచా వ్యాపారాలు వెలవెలబోయాయి. అమ్మకాలు నిలిచిపోయాయి. నెల్లూరు నగరంలో వీఆర్ కళాశాల మైదానంలో వ్యాపారులు బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రతియేటా నెల్లూరునగరవాసులు ఇక్కడి నుండే కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం వర్షాలు పడడంతో టపాకాయలు తడవకుండా కాపాడుకునేందుకు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం దెబ్బతో కొనుగోలుకు వినియోగదారులు రాలేదు.

# రైతుల సేవలో మేమే ముందున్నాం!

రైతాంగానికి సేవలందించడంలో సిండికేట్ బ్యాంక్ ఎప్పుడూ ముందుంటుందని ఆ బ్యాంకు ఎం.డి, సిఇఒ అరుణ్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరులో జరిగిన నెల్లూరు, చిత్తూరు జిల్లాల రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ తమ బ్యాంకు దేశంలోనే ప్రప్రథమంగా రైతులకు ఋణాలిచ్చే కార్యక్రమం చేపట్టిందన్నారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వడం మొదలుపెట్టింది కూడా తామేనన్నారు. ఈమధ్య కాలంలో దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. ఈ సమస్యపై సిండికేట్ బ్యాంకు దృష్టిపెట్టింది. రైతులను ఆదుకునే దిశగా ప్రయత్నాలు ప్రారంభించాం. ఎలాంటి తాకట్టు లేకుండా 2లక్షల వరకు ఋణాలిస్తున్నాం. అలాగే బంగారం విలువలో 90శాతం నగదును 10శాతం వడ్డీతో 3లక్షల వరకు అందజేస్తున్నామని, సిండికేట్ బ్యాంకు అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులైన ఏ.శ్రీధర్‌రెడ్డి, టి.శ్రీనివాసులు, డి.హనుమంతురావు, బి.ఈశ్వరదత్తు, బండి పోలయ్య, కె.అనిల్, పి.రామ్మోహన్‌రెడ్డి అనే రైతులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ బ్యాంకు ఆర్‌ఎం శ్రీకృష్ణ, జి.ఎం ఎం.మోహన్‌రెడ్డి, ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎం.ప్రసాద్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఛైర్మెన్ సంపత్‌కుమార్ ఆచార్య, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరావు, సిండికేట్ బ్యాంకు ఏజిఎం చంద్రమౌళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సుకు నెల్లూరు విద్యార్థులు



నెల్లూరు బాలభవన్ నుంచి అయిదు మంది బాలబాలికలు, రిసోర్స్ పర్సన్స్ సాకేత్, సహజలతో కలిసి న్యూఢిల్లీలో జరిగే నేషనల్ చిల్డ్రన్స్ అసెంబ్లీలో పాల్గొనేందుకు వెళుతున్నారని నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి తెలిపారు. ఈనెల 14 నుంచి 21 వరకు జాతీయ బాలభవన్‌లో నిర్వహించే జాతీయ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. సదస్సులో వారి ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాల మీద మాట్లాడడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల గురించి, వాటి అభివృద్ధి అవసరాల గురించి ప్రాజెక్ట్ సమర్పిస్తారని తెలిపారు. చిత్రకళ, తోలుబొమ్మలాట, జానపద నృత్యం, ఫోటోగ్రఫిలో జాతీయ బాలభవన్ నిర్వహించే వర్క్‌షాపులో పాల్గొంటారని తెలిపారు.

# అల్లూరులో విష్ణు జన్మదిన వేడుకలు



మాజీ శాసనసభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి 57వ జన్మదిన వేడుకలను అల్లూరులోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పాతబస్టాండ్‌లోని వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు ప్రసాదాలు, కేక్స్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. విష్ణు ఊరిలో లేకపోయినా ఆయన అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని జరుపుకోవడమే కాక ఆయన నివాసంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జోరు వానలో కూడా తొణకకుండా నాయకులు కలిసి వేడుకలను జరిపారు. కాటంరెడ్డి కోదండరామిరెడ్డి కేకును కట్ చేసి మాట్లాడారు. వైసిపి సీనియర్ నాయకులు గోపాలరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 65మంది విష్ణు అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ చంద్రలీలమ్మ, వైసిపి నాయకులు కేతిరెడ్డి జగదీష్‌రెడ్డి, రత్తయ్య, శివకుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య జిల్లా ఉపాధ్యక్షులు అనుమాలశెట్టి శివ, శీనయ్య, దశరథరామిరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆంజనేయరాజులు, గోమాల నాయుడు, ప్రజలు, రెడ్‌క్రాస్ డాక్టర్ సాయినాథ్, మెటివేటర్ భాస్కరరావు, నిర్మల, శ్రీను, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి బేజార్

(మొదటి పేజీ తరువాయి)

మురళీ మనోహర్‌జోషి, యశ్వంత్ సిన్హా వంటి సీనియర్లే తిరగబడ్డారు. బీహార్‌లో మహాకూటమి గెలిస్తే పాకిస్తాన్‌లో టపాకాయలు పేలుతాయని ఎన్నికల ప్రచార సభలలో నరేంద్రమోడీ చెప్పారు. బీహార్‌లో మహాకూటమి గెలిచింది. అయితే టపాకాయలు పాకిస్తాన్‌లో కాకుండా ఢిల్లీ బీజేపీ కార్యాలయంలో పేలుతున్నాయి. అయితే ఇవి అసమ్మతి నేతలు పేలుస్తున్న టపాకాయలు.

బీహార్ ఎన్నికల ఫలితాలు బీజేపీ కంటే కూడా ప్రధానిగా నరేంద్ర మోడీ వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చాయి. ఈ ఎన్నికలను ఆయన వ్యక్తిగతంగా తీసుకున్నాడు. పార్టీని ముందు పెట్టకుండా తాను ముందు నిలబడ్డాడు. బీహార్ వెర్రి జనం తన ముఖం చూసి ఓట్లేస్తారనే పిచ్చి భ్రమలో పడ్డాడు. ఒక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఒక ప్రధాని 30 బహిరంగ సభలలో ప్రసంగించడం ఎప్పుడూ జరగలేదు. కాని తొలిసారి నరేంద్ర మోడీ ఆ పని చేసాడు. నరేంద్ర మోడీ ప్రధాని స్థాయి నుండి క్రిందకు దిగాడు. నితీష్ కుమార్, లాలూ ప్రసాద్‌యాదవ్‌ల మీద వ్యక్తిగత విమర్శలకు పాల్పడ్డాడు. వీటిని బీహారీలు స్వాగతించలేదు. ప్రధాని స్థాయిలో ఆయన ఎంతో గౌరవప్రదమైన భాషను వాడాలి. కాని ఆ విజ్ఞత మరిచాడు. మరోపక్క నితీష్‌కుమార్ మాత్రం ఎంతో హుందాగా వ్యవహరిస్తూ ప్రజలకు చేరువయ్యాడు. నరేంద్ర మోడీ విమర్శలను సైతం ఆయన తనకు సానుకూలంగా మలచుకున్నాడు.

ఢిల్లీ ఎన్నికల అనుభవాన్ని నరేంద్ర మోడీ ఏ మాత్రం తలకెక్కించుకోలేదన్న విషయాన్ని బీహార్ ఫలితాలు నిరూపిస్తున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికలు జరిగిన ఆరు నెలలకే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని 7లోక్‌సభ స్థానాలను సాధించిన బీజేపీ అసెంబ్లీకి వచ్చేసరికి మూడు సీట్లకు పడిపోయింది. ఇక్కడా నరేంద్ర మోడీ బ్రాండ్‌నే వాడారు. కాని అరవింద్ కేజ్రీవాల్ అనే సామాన్యుడి ప్రచారం ముందు ఆ బ్రాండ్ పనిచేయలేదు. అదీగాక ప్రధాని, కేంద్రమంత్రులు, బీజేపీ శ్రేణులు భారీ స్థాయిలో మోహరించి అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి దిగడాన్ని ఢిల్లీ ఓటర్లు ఆమోదించలేదు. అదీగాక మోడీ బ్రాండ్ ఇమేజ్ లోక్‌సభ ఎన్నికలతో అయిపోయిందని, మిగతా ఎన్నికల్లో అది పనిచేయదని ఆ పార్టీ అధిష్ఠానం గుర్తించలేదు. మొన్న ఢిల్లీలో చేసిన తప్పునే నిన్న బీహార్‌లోనూ చేసి బోర్లాపడ్డారు.

వాజ్‌పేయి, అద్వానీ వంటి సీనియర్లు లేకుంటే ఈరోజు బీజేపీ ఈ స్థాయిలో వుండేది కాదు. కాని వాళ్లు ఎప్పుడూ వ్యక్తిగత ఇమేజ్‌కు పాకులాడలేదు. 1999లో వాజ్‌పేయి ఇమేజ్‌తోనే బీజేపీ అధికారంలోకి వచ్చింది. కాని వాజ్‌పేయి హయాంలో సమిష్టి విజయం, సమిష్టి బాధ్యత సంస్కృతి వుండేది. ఆయన కేబినెట్ ఎంతో సమర్ధవంతంగా నడిచింది. సీనియర్లకు ప్రాధాన్యత ఉండింది. కాని నేటి నరేంద్ర మోడీ కేబినెట్ అనుభవం లేని వారితో చాలా బలహీనంగా కనిపిస్తోంది. సీనియర్లను పక్కనపెట్టడం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైంది.

బీహార్ చావు దెబ్బ బీజేపీలో చిచ్చు పెట్టింది. ఎంతో కాలంగా దావాగ్నిలా మండిపోతున్న సీనియర్లు ఇప్పుడు తమ ఆగ్రహాన్ని బహిరంగంగానే ప్రదర్శిస్తున్నారు. వాజ్‌పేయి వంటి మహనీయులు చూపిన మార్గాన్ని వదిలేసి నరేంద్ర మోడీ వితండపు బాట పట్టాడని, అందుకే పార్టీ బీహార్‌లో చావుదెబ్బ తిందని పార్టీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు.

మొత్తానికి బీజేపీకి ముఖ్యంగా, నరేంద్ర మోడీ వర్గానికి బీహార్ ఫలితాలు చీకటి జ్ఞాపకాలుగా మిగలనున్నాయి.

# వానా... వానా... వందనం!

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బయితేనేమీ జిల్లాలో నాలుగురోజుల పాటు మంచి వర్షాలే కురిసాయి. గూడూరు డివిజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. వాగులు వంకలు పారాయి. దాదాపు ఎక్కువ భాగం చెరువుల్లోకి నీళ్లొచ్చాయి. బావులు, బోర్లలోనూ నీటి మట్టాలు పెరిగాయి. తాగునీటి సమస్య తీరినట్లే. అలాగే చెరువులు, బోర్ల క్రింద పంటలకూ కొంత కాలం ఇబ్బంది లేదు. అయితే మనకిప్పుడు ముఖ్యంగా కావాల్సింది సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లు నిండడం. మన జిల్లాలో భారీ వర్షాలు పడినంత మాత్రాన వీటికి నీళ్లు రావు. శ్రీశైలంకు వరద రావాలి. లేదా కర్నాటక రాష్ట్రంతో పాటు కర్నూలు, కడప, అనంతపురం వంటి ఎగువ జిల్లాల్లో భారీ వర్షాలు కురవాలి. అప్పుడే ఈ రిజర్వాయర్‌లు నిండుతాయి. ఈ రెండు రిజర్వాయర్‌లు నిండితేనే వచ్చే సంవత్సరం పంటలకు, తాగునీటికి ధోకా లేకుండా వుంటుంది.

# ఉత్తరక్రియలు



## స్వర్గీయ గునపాటి కృష్ణారెడ్డి గారు

**మరణం: 05-11-2015**

మమతల మణిదీపం మీరు.. మానవతకు ప్రతిరూపం మీ పేరు... చెరగని కీర్తిలా మిగిలారు.. మాకందరికీ స్ఫూర్తిగా నిలిచారు.
భౌతికంగా మీరు మాకు దూరమైనా, మీ జ్ఞాపకాలు మా హృదయాలలో ఎప్పుడూ పదిలమే.
మీ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుకుంటూ... శోకతప్త హృదయాలతో శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య: **గునపాటి లీలావతమ్మ**

కుమారులు - కోడళ్లు
**గునపాటి వరదారెడ్డి - కల్పన**
**గునపాటి శ్రీధర్‌రెడ్డి - వినీత**
CMD Vikhyath Infra Developers, Hyd

మనుమలు - మనుమరాళ్లు
**మేఘన**
**శ్రీనిధి, విఖ్యాత్**

కుమార్తె - అల్లుడు
**యెకొల్లు విజయ - మోహన్‌రెడ్డి**

**శిరీష - తిక్కవరపు సందీప్‌రెడ్డి**
**సింధు - పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి**

మునిమనుమరాళ్లు
**పరిణికారెడ్డి**
**హన్వితారెడ్డి**

**పెద్దకర్మ: 19-11-2015 గురువారం నాడు నెల్లూరుజిల్లా విడవలూరులోని మా స్వగృహము నందు జరుగును.**
**కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com